ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 07.06.2026 | సంపుటి : 12 సంచిక : 318 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం



హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మేకిన్ ఇండియా అడిగితే..
# లీక్ ఇండియా చేశారు



## భారత రాజకీయాల్లో యువశక్తి

### కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
### ఇదే మా మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా

*దేశవ్యాప్తంగా జరుగుతున్న పరీక్షల్లో లీకేజీలు, అవకతవకలకు నిరసనగా యువత గళమెత్తడంతో దేశరాజధాని దద్దరిల్లింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది యువత, విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు. దేశ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని, పరీక్షలు, నియామక ప్రక్రియల్లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు యువకులు బొద్దింకల మాస్కులు ధరించి, చేతుల్లో పూలతో నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు తమతల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు.*

- ప్రవేశ పరీక్షల లీకేజీలు, అవకతవకలకు బాధ్యత వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్' ధర్నా గ్రాండ్ సక్సెస్
- నిరసనలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్





స్వదేశానికి చేరుకున్న అనంతరం విమానాశ్రయంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చూపుతున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసిం ది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రద ర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంత ర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్ట న్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ను చేత్తో పట్టుకుని కనిపించారు.



మిగతా 2లో..

### తెలంగాణ జాతి సంస్కృతి ప్రపంచంలోనే
# అనన్య సామాన్యం

- మనది తెలంగాణ జాతి అని ప్రతి తెలంగాణ బిడ్డ గర్వంగా చెప్పుకోవాలి
- రాష్ట్ర భవిష్యత్తుపై బీఆర్ఎస్‌కు మాత్రమే విజన్ ఉంది
- 2028లో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే
- తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రవాస బిడ్డలు కలిసిరావాలి : కేటీఆర్
- మలేషియాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**కౌలాలంపూర్(జనంసాక్షి):**మలేషియా దేశంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మలేషియా తెలుగు అసోసియేషన్, బీఆర్ఎస్ ఎన్నారై మలేషియా శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సంబరాలకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న ప్రవాస తెలంగాణ బిడ్డలను (ఎన్నారైలను) ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా తమ మాతృభూమిని మర్చిపోకుండా ఆవిర్భావ సంబరాలు చేసుకుంటున్న ఎన్నారైలందరికీ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్న ఊరును, కన్న తల్లిని మర్చిపోకుండా ఖండాలు దాటినా తెలంగాణ తల్లిని తలుచుకుంటూ ఆవిర్భావ దినోత్సవాలను ఇంత ఘనంగా జరుపుకోవడం గొప్ప విషయమని కొనియాడారు.వేల సంవత్సరాల కిందట మొదలైన తెలంగాణ చరిత్ర రాజులు, చక్రవర్తులు, కవులు, కళాకారులు, సంస్కృతి,

మిగతా 2లో..



# ధాన్యం కొనలేని మోదీ గద్దెదిగాలి

### అభివృద్ధికి నిరోధకంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు • 'కారు' చెడిపోయి కార్ఖానాలో ఉంది..

- ఎవరెన్ని చేసినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- కోహెడ పండ్ల మార్కెట్‌తో అంతర్జాతీయ గుర్తింపు
- నాడు ఎంపీగా హామీ ఇచ్చాను.. నేడు నెరవేర్చాను
- మార్కెట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డిప్రతినిధి(జనంసాక్షి):**రంగారెడ్డిజిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే

మిగతా 2లో..

### జలవనరుల ఆక్రమణల జోలికి వెళ్లాలంటే
# జంకుతున్నారు

- హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోంది
- వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...బ్లూకలర్ జాబ్స్
- పరిస్థితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి
- బెంగుళూరు సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వార్త 2లో

# ఆగని ఘర్షణలు

- ఇరాన్ రాడార్ కేంద్రాలపై అమెరికా దాడి
- హర్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా
## 'స్త్రీ రైడ్'
ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

హెచ్-1బీ వీసాపై
## ముసాయిదా
అమెరికా కాంగ్రెస్ ముందుకు కీలక బిల్లు

రాష్ట్రపతి పాలన నివారించేందుకే..
## ఓకే చెప్పాం : స్టాలిన్

వివరాలు 2వ పేజీలో..

# దేశ ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై మోదీ సమాలోచనలు



### ప్రపంచ అనిశ్చితుల వేళ ఆర్థిక సలహా మండలి సభ్యులతో సమావేశం


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం. కాగా, శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ

మిగతా 2లో..

# కురిసిన వాన.. మురిసిన నగరం

### హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం
### వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు ఉపశమనం

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, రాయదుర్గం, హైదర్‌గూడ, ఉప్పరపల్లి, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో కొంతకాలంగా వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు కొంత ఉపశమనం కలిగింది.





# వాహనం మొరాయించి.. సహారా ఎడారిలో చిక్కి..

ఆహారం,నీళ్లు లేక 49 మంది మృతి
పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన

**సహారా(జనంసాక్షి):**పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07.06.2026




# మేకిన్‌ఇండియా అడిగితే.. లీక్ ఇండియా చేశారు

జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జర గాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# ఆగని ఘర్షణలు

**టెహ్రాన్(జనంసాక్షి):**



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# రాష్ట్రపతి పాలన నివారించేందుకే ఓకే చెప్పాం : స్టాలిన్

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులో టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ సహా డీఎంకే కూటమి పక్షాలు మద్దతు ఇవ్వడంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కే స్టాలిన్ స్పందించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. ఏఐఏడీఎంకే పార్టీకి చెందిన కొందరు నేతలు డీఎంకేలో చేరిక సందర్భంగా చెన్నైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ విధంగా మాట్లాడారు. టీవీకేతో వెళ్లే విషయాన్ని కూటమిలోని కొన్ని పార్టీలు తన దృష్టికి తీసుకురాగా.. 'మీరు వెళ్లొచ్చు. అది మీ ఇష్టం.. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. మిమ్మల్ని ఆపను' అని చెప్పాను. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం నివారించాలనే ఏకైక ఉద్దేశంతో నేను వారిని అనుమతించాను. అలా చేయకపోతే తమిళనాడులో భాజపా పాలనకు మార్గం సుగమం అయ్యేది" అని స్టాలిన్ అన్నారు.తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే అధికారంలోకి రావాలనే ఆ పార్టీలు కోరుకున్నాయని, అందుకే తమతో పొత్తు పెట్టుకున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తమ పార్టీని నిరుత్సాహపరచలేవని.. ప్రతిపక్షంలో ఉంటూనే ప్రజలకు సేవ చేస్తామన్నారు.

# దేశ ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై మోదీ సమాలోచనలు

ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్?లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్? మరింత పటిష్టంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరువారి కార్యాలయము
పీఐయూ డివిజన్, నల్గొండ
Lr.No.D3/Tenders/02/2026-27/DPRENLG ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు Dt:04.06.2026
నల్గొండ జిల్లా నల్గొండ టౌన్‌లో & పీఐయూ డివిజన్‌లో మొత్తం అంచనా విలువ రూ.85 లక్షల పనులకు దిగువ సంతకం దారు (10) టెండర్లను ఆహ్వానించడమైనది. దరఖాస్తుకు చివరి తేదీ: 11.06.2026. టెండరు షెడ్యూల్ జారీ చేయు తేదీ: 12.06.2026. టెండరు స్వీకరించు& తెరచుతేదీ: 15.06.2026. మిగతా వివరాలకు నల్గొండ డీపీఆర్ఈ పీఐయూ కార్యాలయము, జడ్పీపీ కాంప్లెక్స్, రెండవ అంతస్థు, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, నల్గొండ టౌన్‌లో సంప్రదించగలరు.
సం/- జిల్లా డీపీఆర్ఈ ఇంజినీర్,
పీఐయూ.. :: నల్గొండ
DIPR No.3761-PP/CL/ADVT/2026-27

# ధాన్యం కొనలేని మోదీ గద్దె దిగాలి


అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని



చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతు న్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతా నికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడు తున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడు తున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంత మంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుం దని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్‌ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్‌ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గ్దదె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# జలవనరుల ఆక్రమణల జోలికి వెళ్లాలంటే జంకుతున్నారు

బెంగుళూరు,జూన్6(జనంసాక్షి):ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు.జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం




చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్ట్‌లతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను ఆక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు దైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్పోర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది.ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

# వాహనం మొరాయించి.. సహారా ఎడారిలో చిక్కి..

ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుం డగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# అన్నామలై బాటలో సుమతి వెంకటేశ్

**బిజెపికి రాజీనామా చేసిన పార్టీ రాష్ట్రకార్యదర్శి**

**చెన్నై(జనంసాక్షి):**తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నానని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేష్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ పార్టీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు. అయితే, పార్టీ వీడినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, జాతీయవాదం, దేశభక్తి సిద్ధాంతాలు తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని సుమతి వెంకటేష్ స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# తెలంగాణ జాతి సంస్కృతి ప్రపంచంలోనే అనన్య సామాన్యం

పాటలతో తరతరాలుగా విలసిల్లుతున్నదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ జాతిలో ప్రతి తరం ఏదో ఒక యుద్ధాన్ని, రణాన్ని నడిపించిందని గుర్తుచేశారు. అది సాయుధ పోరాటాలైనా కావచ్చు, ప్రజా ఉద్యమాలు కావచ్చు, త్యాగాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమైనా కావచ్చు... ప్రతిసారి తెలంగాణ జాతి తోటి ప్రజల కోసం కొట్లాడిందన్న విషయాన్ని మనం మర్చిపోకూడదన్నారు.భక్త రామదాసు (కంచర్ల గోపన్న) నుంచి గోరటి వెంకన్న దాకా దిక్కార స్వరాన్ని వినిపించిన ప్రజా కళాకారుల నుంచి మొదలుకొని ప్రజానాయకులు ఎందరినో కన్న ఈ గడ్డ అత్యంత ప్రత్యేకమైనదన్నారు. ప్రకృతితో మమేకమై బతుకమ్మను జరుపుకునే, పువ్వులను పూజించి ప్రకృతిని ఆరాధించే ఒకే ఒక్క జాతి ఈ ప్రపంచంలో తెలంగాణ జాతి అని ఆయన స్పష్టం చేశారు. ఇంత అద్భుతమైన చరిత్ర, సంస్కృతి కలిగిన మనందరం "నాది తెలంగాణ, నాది తెలంగాణ జాతి, నేను తెలంగాణ బిడ్డను" అని సగర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో జరుగుతున్నదని, అయితే ఈ ప్రత్యేక రాష్ట్రం ఊరికేనే రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. దశాబ్దాల పాటు జరిగిన తొలి తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత కేసీఆర్ గారి సారథ్యంలో జరిగిన మలి తెలంగాణ ఉద్యమంతోనే ఇది సాధ్యమైందన్నారు. మలి విడత ఉద్యమానికి నాయకత్వం వహించి, సబ్బండ వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్ళిన కేసీఆర్ గారి నాయకత్వంలో పుష్కరానికి పైగా సాగిన ప్రజాస్వామిక ఉద్యమం వల్లనే ప్రత్యేక తెలంగాణ సిద్ధించిందన్నారు. అనేక పదవీ త్యాగాలు, సవాళ్లను దాటుకొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వరించారు.ప్రపంచంలో కొరియా, తైవాన్, సింగపూర్, మలేషియా, వియత్నాం లాంటి దేశాలను 'ఏషియన్ టైగర్స్' గా పిలుస్తుంటారని, అవి చిన్న దేశాలే అయినా సాధించిన విజయాలు అతి గొప్పవని కేటీఆర్ పేర్కొన్నారు. అదేవిధంగా భారతదేశంలో చిన్న రాష్ట్రమైన తెలంగాణ సైతం అత్యంత తక్కువ కాలంలోనే అద్భుతమైన విజయాలను సాధించిందన్నారు. ఒకనాటి వలసల తెలంగాణను, కరువుల తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ గారిదేనని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణను వ్యవసాయం నుంచి మొదలుకొని పరిశ్రమల దాకా ప్రతి రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టింది ముమ్మాటికీ కేసీఆర్ గారేనని స్పష్టం చేశారు. ఒకనాడు అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా పేరున్న తెలంగాణను ఆర్థిక అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపి, తలసరి ఆదాయంతో పాటు స్థూల జీఎస్డీపీ లోనూ ప్రథమ స్థానానికి చేర్చామన్నారు. ఒకప్పుడు గేలి చేయబడిన తెలంగాణ సంస్కృతిని ఈనాడు సగర్వంగా ప్రపంచానికి చాటిచెప్పింది కూడా ముమ్మాటికీ కేసీఆరే అన్నారు."ఇవేమీ తెలియని 4 ఫీట్లు ఉన్న నాయకులు కొంతమంది తెలంగాణ గురించి, తెలంగాణ అభివృద్ధి గురించి, తెలంగాణ నీళ్ల గురించి, నిధుల గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాములై బుసకొడతాయి. అలాంటి విషనాగులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి" అని ఆయన హెచ్చరించారు. 2028లో మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుందని, కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రిగా రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.ఈరోజు సంబరాలు జరుపుకుంటున్న మలేషియాతో కూడా తెలంగాణకి ఒక అద్భుతమైన సంబంధం ఉందన్నారు. మలేషియా మాదిరే తెలంగాణలోనూ పామాయిల్ విప్లవం సాధించి, రైతన్నల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న ఏకైక ఉద్దేశంతో పామాయిల్ కోసం మలేషియా నుంచి విత్తనాలు, మొక్కలు తీసుకువచ్చి తెలంగాణలో నాటించిన అంశాన్ని గుర్తుచేశారు. ఫలితంగా ఈరోజు భారతదేశంలోనే అత్యధికంగా పామాయిల్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచిం దన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా 'స్త్రీ రైడ్'

హైదరాబాద్(జనంసాక్షి): గిగ్ వర్కర్లలో ఇప్పుడు మహిళలు కూడా చేరబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు.మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం




చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని ఆనంద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# హెచ్-1బీ వీసాపై ముసాయిదా

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా కాంగ్రెస్ ముందుకు ఓ కీలక ముసాయిదా బిల్లు వచ్చింది. గ్రీన్ కార్డు పొందేందుకు హెచ్1బీ వీసాను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ.. దీనికి స్వస్తి పలకాలని కోరుతూ ఓ రిపబ్లికన్ నేత బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుడు చిప్‌రాయ్ గురువారం 'అమెరికన్ వైట్-కాలర్ వర్కర్ జాబ్స్' పేరుతో ఈ ముసాయిదా బిల్లును తీసుకొచ్చారు. విదేశీ విద్యార్థులు పట్టభద్రులైన తర్వాత పరిమిత కాలం పాటు అమెరికాలో పనిచేసేందుకు అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఒాఖు) కార్యక్రమాన్ని కూడా రద్దు చేయాలని ఇందులో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు నలభై ఏళ్ల చరిత్రలో హెచ్1బీ వీసా దుర్వినియోగం అయ్యిందన్నారు. దీని కారణంగా చౌకైన విదేశీ కార్మికుల కోసం.. అమెరికన్ రంగాలకు చెందినవారిని పక్కనపెడుతున్నారని ఆరోపించారు. ఈ లాటరీ ఆధారిత విధానానికి ముగింపు పలకాలని కోరారు. దాని స్థానంలో ప్రతిభకు, వాస్తవ వేతన ప్రమాణాలను అమలుచేస్తూ.. అమెరికన్ వైట్ కాలర్ ఉద్యోగులకు ప్రాధాన్యమిచ్చే వ్యవస్థను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు యూఎస్ టెక్ వర్కర్స్, ఇమిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమిగ్రేషన్ రిఫార్మ్ మద్దతు తెలిపాయి.

## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో జాగ్రత్త
- జిల్లాల కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం

**హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) :** జూన్ 21న జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 నగరాల్లో 72,956 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నారని చెప్పుకొచ్చారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశర చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల రవాణాకు తొలిసారిగా భారత వైమానిక దళం సేవలు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షల భద్రతకు ఈసారి ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు.


## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాసమస్యలు గాలికి..

- మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



**వరంగల్ ఈస్ట్, జూన్ 06 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్, ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్– 2026 శిక్షణా కార్యక్రమం నగరంలోని బొల్లికుంట వాగ్దేవి కాలేజీలో శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మొదటిరోజు నిర్వహించిన ప్రశిక్షణ శిబిరంలో ఏడు కాలంశాలు నిర్వహించారు. ప్రశిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హాజరై బిజెపి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. రైతాంగ సంక్షేమం, నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇటీవల కాలంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొన్ని స్వార్థ రాజకీయ శక్తులు తనపై, పార్టీపై కుట్రపూరిత అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ఇలాంటి చౌకబారు విమర్శలకు కార్యకర్తలు ఎవరూ అధైర్యపడకుండా ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తదుపరి వివిధ కాలాంశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవి, జిల్లా ప్రబారి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధీ వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, మంజులారెడ్డి, కంభంపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు



- కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు

**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రాహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. శుక్రవారమే బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనెంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మధ్యవర్తి రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు విషయం తెలిసిన వెంటనే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. ఆయనపై సైబరాబాద్ పోలీసులు నిఘా ఉంచారు. కొంతకాలం బెంగళూరులో ఉన్న బ్రహ్మనాయుడు అక్కడి నుంచి కేరళకు వెళ్లి ఆపై తమిళనాడులోని కాంచీపురంకు వెళ్లారు. బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసుల బృందం, ఈవోడబ్ల్యూకు సంబంధించిన మరో బృందం అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

# వానలో తడిస్తూ.. చీకటిలో వణుకుతూ..

### జొన్న టోకెన్ల కోసం 'అన్నదాత' ఆర్తనాదం!

- కుబీర్ ఐకేపీ కేంద్రం వద్ద హృదయవిదారక దృశ్యాలు
- బండలు, బాటిళ్లే సాక్షిగా క్యూలైన్లో పడిగాపులు
- అధికారుల జాప్యంపై రైతులు అసహనం.. తోపులాటలో మహిళల అవస్థలు






**కుబీర్, జూన్ 06 (జనంసాక్షి) :** కుబీర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద జొన్న టోకెన్ల కోసం రైతులు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం పండించిన పంటను కొంటుందో లేదో అన్న భయానికి తోడు, అధికారుల నిర్లక్ష్యం తోడై అన్నదాతను నడిరోడ్డుపై నిలబెట్టింది. శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతుల పరిస్థితిని మరింత దయనీయంగా మార్చింది. శుక్రవారం రాత్రి వర్షం కురుస్తున్నా, తలదాచుకోవడానికి కనీసం నీడ లేక, కరెంటు లేని చీకటిలో తడుస్తూనే రైతులు రాత్రంతా గడిపారు. తమ వంతు వచ్చినప్పుడు క్యూలైన్ చెదిరిపోతుందనే ఆందోళనతో, వర్షాన్ని కూడా లెక్కచేయకుండా బండలు, వాటర్ బాటిళ్లకు కాపలా ఉంటూ కటిక నేలపైనే పడిగాపులు కాశారు. వానలో తడిసిన దుప్పట్లతోనే చలికి వణుకుతూ రాత్రంతా ఆ చీకటిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. "రైతు అంటే అంత చులకనా? మమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టడం ఏంటని?" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యం - తోపులాట**

టోకెన్ల జారీలో జరుగుతున్న జాప్యంపై శనివారం ఉదయం అధికారులను రైతులు నిలదీశారు. అధికారులు, సిబ్బంది ఆలస్యంగా రావడంతో క్యూలైన్లలో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ క్రమంలో మహిళా రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధికారుల సమన్వయ లోపం వల్లే తమకు ఈ దుస్థితి దాపురించిందని, తక్షణమే జొన్నల కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి: ఎన్నిల అనిల్**



ఈ దుస్థితిపై కుబీర్ మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతుల గోడు విని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతుల శ్రమతోనే ముఖ్యమంత్రి అన్నం తింటున్నారని, వారి కష్టాలను గాలికొదిలేస్తే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని" హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే జొన్నల కొనుగోలుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అత్యవసర రక్తదానంతో బాధితులకు ప్రాణదానం

- వెంటనే స్పందించిన కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ సభ్యులు
- రక్తదాతలను అభినందించిన డాక్టర్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ విభాగం జిల్లా చైర్మన్ డా. చందన సుధాకర్




**హైదరాబాద్(జనంసాక్షి) :** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన బాధితులకు అండగా నిలుస్తూ మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తం అవసరమైన పలువురు బాధితులు మెడికల్ అండ్ హెల్త్ వింగ్ డీసీసీ మంచిర్యాల ప్రతినిధులను సంప్రదించగా, వెంటనే స్పందించిన కమిటీ సభ్యులు పవన్ కల్యాణ్, సంతోష్, శ్రీకాంత్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. వారి తక్షణ స్పందనతో బాధితులకు సకాలంలో రక్తం అందడంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్య సహాయం అందించేందుకు నిరంతరం సేవలందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. రక్తం అవసరమైన సమయంలో దాతలను సమీకరించడం, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలను విభాగం చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ డా. చందన సుధాకర్ మాట్లాడుతూ రక్తదానం చేసిన పవన్ కల్యాణ్, సంతోష్, శ్రీకాంత్‌ల సేవాభావాన్ని అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి అవసరమైన వారికి సహాయం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క యూనిట్ రక్తం కూడా ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడగలదని, అందువల్ల యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది కేవలం ఒక సామాజిక సేవ మాత్రమే కాకుండా ప్రాణాలను నిలబెట్టే మహోన్నత దానమని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదాతల నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అత్యవసర వైద్య అవసరం వచ్చినా, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ సభ్యులు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన సభ్యులను పలువురు కాంగ్రెస్ నాయకులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు అభినందించారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం ద్వారా వారు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరింత మంది యువత రక్తదానానికి ముందుకు వచ్చి మానవతా సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

**అధికారును ఆదేశించిన మంత్రి వివేక్**



**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై మంత్రి వివేక్ వెంకటస్వామి సీరియస్ అయ్యారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లారీల కదలికలపై నిరంతరం పర్యవేక్షించాలని హుకుం జారీ చేశారు. ఇసుక ఆదాయం పెంపుపై టీజీఎండీసీ అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇసుక నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని దిశానిర్దేశర చేశారు. అలాగే, సాండ్ బజార్ల పనితీరుపై మంత్రి వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కీలక ఖనిజాల అన్వేషణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖనిజ వనరుల సమర్థ నిర్వహణకు అమలు వ్యవస్థ పటిష్ఠం చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ నియంత్రణ చర్యలను మంత్రికి.. టీజీఎండీసీ అధికారులు వివరించారు. రాష్ట్ర ఖనిజ రంగంలో ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## హోటల్ స్లాబ్ కూలి నలుగురికి గాయాలు



**వికారాబాద్, జూన్6 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లిలో శనివారం మధ్యాహ్నం ఓ హోటల్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జేసీబీ సాయంతో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాలకింద ఇంకెవరైనా ఉన్నారా అని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆరా తీస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

- తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర
- సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి
- మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్



**మహబూబ్‌నగర్, జూన్6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

# మద్యం ధరలు పెంచే యోచన




- రాష్ట్ర ఖజానాకు డబ్బులే డబ్బులు

**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్‌పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడిక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు పెరగ్గా, కమర్షియల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి. వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
7 జూన్ 2026

సంపాదకీయం

# కాక్రోచ్‌ల తిరుగుబాటు


పకోడీలు అమ్ముకో, పంచర్ షాపు పెట్టుకో.. ఇవే నేటి యువతకు ఈ దేశ పాలకులు చూపిన దారులు. నిరుద్యోగాన్ని సహజ విధిగా అంగీకరించమని, కలలు కనడం విలాసమని, ఆకలిని దేశభక్తితో నింపుకోమని పరోక్షంగా చెప్పిన రాజకీయ సంస్కృతికి కాక్రోచ్ రూపంలో ఇప్పుడు జవాబు వచ్చింది. జంతర్ మంతర్ వేదికగా మొదలైన ఈ కదలిక కేవలం ఒక ఉద్యమం కాదు. ఇది దశాబ్దాల నిరాశను, పదేపదే పడిన అవమానాన్ని, "మీరు పరాన్న జీవులు" అన్న సెటైర్‌ను రక్తంలో మండించుకున్న తరం గళం. వారు ఆ మాటనే ఆయుధంగా మలుచుకున్నారు. కాక్రోచ్‌లం అయినా సరే, మీ వ్యవస్థ మొత్తాన్ని కొరికేస్తాం అని పిడికిలి బిగించారు.

ఈ దేశంలో యువత రాజకీయంగా చైతన్యవంతం కాదని, మతోన్మాదపు భావోద్వేగాలలో కొట్టుమిట్టాడుతుందని ప్రచారం నిర్విరామంగా సాగింది. మందిరాలు, మసీదులు, మతపు వివాదాలు.. ఇవే యువతను ఆక్రమిస్తాయని లెక్కకట్టిన వ్యూహకర్తలకు ఈ చీమల దండు దెబ్బ కొట్టింది. సోషలిస్టు, సెక్యులర్ ఆలోచనలు సమాధి అయిపోయాయని సంతృప్తిపడిన సాంప్రదాయ పార్టీల గుండెలు ఈ పిడికిళ్ళను చూసి కలుక్కుమన్నాయి. "లీక్ ఇండియా కాదు, మేక్ ఇండియా కావాలి" అన్న నినాదం చిన్న మాట కాదు. వ్యవస్థ పగుళ్ల గురించి, లీకయిపోతున్న అవకాశాల గురించి, మేధస్సు పారిపోతున్న దేశం గురించి యువత మాట్లాడుతోంది. ఉద్యోగాలు లేవు, పరీక్షల్లో పేపర్లు లీక్ అవుతున్నాయి. భవిష్యత్తు అనిశ్చితంగా ఉంది. ఇవన్నీ వారికి రోజూ అనుభవంలోకి వచ్చే వాస్తవాలు. ఆ నొప్పి నుంచి పుట్టిన రాజకీయ స్పృహకు ఎంత బలం ఉంటుందో ఈ కదలిక నిరూపిస్తోంది.ఓ

పాత రాజకీయ పార్టీలు ఇప్పుడు ఒక సంక్షోభంలో ఉన్నాయి. యువతను తమ ఓటు బ్యాంకుగా తీసుకుంటూనే, వారి అసలు సమస్యలను పక్కన పెట్టిన వైఖరి ఇక చెల్లదు. జాతీయవాదపు మత్తు, అయోమయంలో ముంచే అస్తిత్వ రాజకీయాలు, ఉచిత హామీల ఎర ఇవేవీ ఈ తరాన్ని మళ్ళీ నిద్రపుచ్చలేవు. ఎందుకంటే కాక్రోచ్‌లు నాశనమవ్వవు, వాటిని అణచిపెట్టే కొద్దీ పెరుగుతాయి. ఈ ఉద్యమానికి ఎదురుగా ఉన్న సవాళ్ళు తక్కువేమీ కావు. సంఘటితం కాకపోవడం, నాయకత్వ శూన్యత, వ్యవస్థ చేసే అణచివేత.. ఇవన్నీ ఈ శక్తిని చిన్నాభిన్నం చేయవచ్చు. ఆవేశం ఎంత ప్రబలంగా ఉన్నా, రాజకీయ అనువాదం జరగకపోతే అది రోడ్డు మీద చెల్లాచెదురైపోతుంది. కాబట్టి ఈ యువత ముందు ఉన్న అసలు పరీక్ష భావోద్వేగాన్ని వ్యూహంగా మలచుకోవడం, ఉద్యమాన్ని ఉద్యమంగానే కాదు, ప్రత్యామ్నాయంగా నిలబెట్టడం.

అయినా ఒక విషయం స్పష్టం. భారత రాజకీయ ముఖచిత్రం మారే సంకేతాలు కనిపిస్తున్నాయి. సెటైర్లకు ఎదురుగా నిలబడి, అవమానాన్ని అస్త్రంగా మార్చుకున్న తరం మేల్కొంది. పకోడీ అమ్ముకోమని చెప్పిన వారికి తెలియాలి ఈ కాక్రోచ్‌లు ఇప్పుడు రాజ్యాంగం పుటలు చదువుతున్నాయని..! హక్కుల గురించి మాట్లాడుతున్నాయని..! రాజకీయ అక్షరాస్యత నేర్చుకుంటున్నాయని..! అది ఏ అధికారానికైనా నిజమైన సవాలు.

# రక్తంతో రాసిన రాజ్యాంగం... ఇనుప బూట్ల కింద హక్కులు!



మనిషి నోరు తెరవడం నేరమయ్యే రోజు వస్తే, ఆ సమాజం ఇక సమాజం కాదు అది సజీవ నరకం, ఒక చీకటి చెరసాల. ఈ స్వేచ్ఛా భారతావనిపై జన్మించిన ప్రతి మనిషికీ అతను పేదైనా, ధనికుడైనా, అగ్రవర్ణుడైనా, దళితుడైనా మాట్లాడే హక్కు ఉంది. ఆలోచించే స్వేచ్ఛ ఉంది. నిలదీసే నైతికత ఉంది. అన్యాయంపై గళమెత్తే సార్వభౌమత్వం ఉంది. ఇవి పాలకుల దయాభిక్షతో దక్కినవి కావు ఇవి పుట్టుకతోనే సిద్ధించిన సహజ సిద్ధ హక్కులు. ఇవి పవిత్ర రాజ్యాంగం గుర్తించిన ప్రాథమిక సూత్రాలు. అంతకంటే మిన్నగా, ఇవి నిరంకుశత్వంపై పోరాడిన మన పూర్వీకుల రక్తంతో చరిత్ర పుటలపై లిఖించిన సత్యాలు.అయినా నేడు ఈ దేశంలో ఒక వింత నాటకం, వికృత క్రీడ నడుస్తోంది. హక్కులు అడిగిన వారిని నడిరోడ్డుపై అరెస్టు చేస్తున్నారు. న్యాయం కోసం పోరాటం చేసిన వారిని చీకటి జైలు గదుల్లో బంధిస్తున్నారు. నిజం మాట్లాడిన వారిపై దేశద్రోహం లాంటి క్రూరమైన కేసులు బనాయిస్తున్నారు. నిరసన తెలిపే హక్కును వాడుకుంటున్న విద్యార్థులను, రైతులను, కార్మికులను, మహిళలను ప్రతి ఒక్కరినీ అసాంఘిక శక్తులు అంటూ ముద్ర వేసి వేధిస్తున్నారు. ఇది అసలైన ప్రజాస్వామ్యమా? ఇది ధర్మమా? లేక ఇది అధికార పీఠంపై కూర్చున్న పాలకుల మొరటు అహంకారమా?చరిత్రలో ప్రతి గొప్ప విప్లవమూ ఒక చిన్న ప్రశ్నతో నే మొలకెత్తింది. నాడు బ్రిటీషువారిని చూసి మహాత్మా గాంధీ ఈ దేశం మనది కాదా? అని ప్రశ్నించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ మానవుడిగా నాకు సమాన గౌరవం లేదా? అని నిలదీశారు. విప్లవ వీరుడు భగత్ సింగ్ స్వేచ్ఛ కోసం ప్రాణం ఇవ్వడం నేరమా? అని గర్జించారు. ఆనాడు పాలకులు వారిని నేరస్థులుగా చూశారు. మరి నేడు ఆ ప్రశ్నలు నేరాలయ్యాయా? ఆ మహోన్నత పోరాటాలు తప్పులయ్యాయా? కానే కావు. పోరాటం ఎప్పుడూ తప్పు కాదు అది ప్రజాస్వామ్యపు జీవనాడి, మూలస్తంభం.

ప్రపంచంలో ఏ ఒక్క హక్కూ పాలకుల నుంచి ఉచితంగా రాలేదు ప్రతి చిన్న హక్కు వెనుకా ఒక సుదీర్ఘ పోరాటం ఉంది, ఎందరో త్యాగధనుల బలిదానం ఉంది, ప్రతి రక్తాక్షరంలోనూ స్వేచ్ఛా కాంక్ష ఉంది. పౌర హక్కు అంటే కేవలం ఒక చట్ట పుస్తకంలోని డ్రై మాట కాదు. అది ఒక మనిషి ఆత్మగౌరవ ఉనికికి రక్షణ కవచం. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును, నిరసన తెలిపే హక్కును, సమాన న్యాయం పొందే హక్కును ప్రసాదించింది. ఇవి కేవలం తెల్ల కాగితంపై నల్లటి అక్షరాలు కావు. ఇవి బాబాసాహెబ్ అంబేద్కర్ రాత్రింబవళ్ళు శ్రమించి, వేల సంవత్సరాల అణచివేతకు, వివక్షకు సమాధానంగా వ్రాసిన జీవన వేదాలు.కానీ ఇవాళ్టి క్షేత్రస్థాయి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడండి. ఫోర్త్ ఎస్టేట్ అనబడే పత్రికా స్వాతంత్ర్యం సంకెళ్ళలో చిక్కుకుంది. సోషల్ మీడియాలో పాలకుల తప్పులను ఎండగట్టినందుకు FIRలు నమోదవుతున్నాయి. యూనివర్సిటీల్లో మేధావులైన విద్యార్థులు ప్రశ్నిస్తే, వారిపై సస్పెన్షన్ వేటు పడుతోంది. అన్నం పెట్టే రైతులు తమ హక్కుల కోసం దేశ రాజధాని రోడ్లపై నిలబడితే, వారిపై నీళ్ళ ఫిరంగులతో పిచికారీ చేస్తున్నారు. ఇది ఏ తరహా ప్రజాస్వామ్యం? ఇది ఏ రకమైన న్యాయ సూత్రం?అణచివేసే పాలకులు చరిత్ర పాఠాలను ఎప్పటికీ నేర్చుకోరు. 1975 లో దేశంపై నల్లటి అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించినపుడు నాటి పాలకులు అనుకున్నారు జనాన్ని జైళ్ళలో పెడితే, భయపెడితే నోళ్ళు మూతపడతాయని. కానీ ఏం జరిగింది? ప్రజలు మరింత ఉప్పెనలా, బలంగా లేచారు. ప్రతి అణచివేతా ఒక కొత్త విప్లవాత్మక పోరాటానికి బీజం వేసింది. ఇది కాలం నేర్పించిన అమోఘమైన పాఠం. ఈ సత్యాన్ని గ్రహించని ఏ అధికారమైనా తన వినాశనాన్ని తనే స్వయంగా కొనితెచ్చుకుంటుంది. నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను గమనించండి. మహిళలు తమపై జరిగే అమానుష హింసకు వ్యతిరేకంగా గళమెత్తితే వారిని సమాజంలో అశాంతి కలిగించే వారు అని ఈసడించుకుంటున్నారు. ముస్లిం, క్రైస్తవ, దళిత సోదరులు తమపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడితే వారిని క్షణంలో దేశ విద్రోహులు గా చిత్రీకరిస్తున్నారు. ఇదేనా మనం కలలుగన్న ప్రజాస్వామ్యం? ఇదేనా ఘనమైన భారతావని?ప్రశ్నించడం అస్సలు నేరం కాదు. ఒక నిజమైన ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి ప్రజలు పాలకులకు మోకరిల్లకూడదు. ప్రజాప్రతినిధులు ప్రజల సేవకులు మాత్రమే వారు సర్వాధికారులు కారు. కానీ ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించిన నేటి పాలకులు, తమను ప్రశ్నించే వారిని శత్రువులుగా చూస్తున్నారు. నిజాలను నిర్భయంగా రాసే పత్రికలను, డిజిటల్ మీడియాను నాశనం చేయడానికి కుట్రలు పన్నుతున్నారు. నిరసన తెలిపే సామాన్య జనాన్ని భయపెట్టడానికి పవిత్రమైన చట్టాన్ని ఒక ఆయుధంగా మార్చుకుంటున్నారు.కానీ ఒక విషయం ఎప్పటికీ జ్ఞాపకం ఉండాలి చట్టం అనేది పాలకుల చేతిలో ఆయుధం కాదు. చట్టం అనేది సామాన్యుడి రక్షణ కవచం. ప్రజలను రక్షించాల్సిన కవచాన్ని, వారి ని భయపెట్టే ఆయుధంగా మార్చే వారు రాజ్యాంగాన్ని దారుణంగా అవమానిస్తున్నారు. వారు బాబాసాహెబ్ అంబేద్కర్ ను, భగత్ సింగ్ ను, మహాత్మా గాంధీని అవమానిస్తున్నారు. అంతకంటే దారుణంగా, వారు ఈ దేశ ఆత్మను నిలువునా హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మట్టిపై తిరుగుబాటుకు, పోరాటానికి ఒక ఉజ్వలమైన చరిత్ర ఉంది. ముఖ్యంగా తెలుగు నేల అనేక చారిత్రాత్మక విప్లవాలకు ప్రత్యక్ష సాక్షి. శ్రీకాకుళం గిరిజన సాయుధ పోరాటం, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ హైదరాబాద్ విముక్తి పోరాటం, సొంత రాష్ట్రావతరణ కోసం జరిగిన ప్రజా ఆందోళనలు ఇవన్నీ నినదించే సత్యం ఒక్కటే, ఈ నేల జనం ఎప్పటికీ నిద్రపోరు. అన్యాయాన్ని అస్సలు భరించరు. ఏ పాలకుడైనా హద్దు దాటి నిరంకుశంగా ప్రవర్తిస్తే, ఈ నేల ప్రజా రౌద్రంతో జ్వలిస్తుంది. ఈ మట్టి జనం సింహాల్లా లేచి నిలబడతారు. నేడు మళ్ళీ అలాంటి క్లిష్ట సమయం ఆసన్నమైంది. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేవు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రేపటి పౌరులైన యువత నిరాశ నిస్పృహల్లో మునిగిపోతోంది. స్త్రీలు రోడ్లపై ఒంటరిగా నడవడానికి భయపడుతున్నారు. ఈ నిత్య జీవిత సమస్యల గురించి పాలకులను ప్రశ్నిస్తే ఏం చేస్తున్నారు? జవాబు చెప్పడం లేదు సరే కదా, పైగా ప్రశ్నించిన వారిని సమాజంలో నేరస్థులుగా చూపిస్తున్నారు. ఇది అన్యాయానికి పరాకాష్ఠ, ప్రజాస్వామ్య ద్రోహం. సెడిషన్ చట్టం, ఖూపా, యూపా ఇవేమిటి? ఒకప్పుడు తెల్లదొరలు, బ్రిటీషువారు భారతీయులపై తమ నిరంకుశ పాలనను నిలబెట్టుకోవడానికి, మన స్వాతంత్ర్య సమరయోధుల గొంతు నొక్కడానికి ఈ నల్ల చట్టాలను వాడారు. స్వాతంత్ర్య గడ్డపై ఇన్నేళ్లు గడిచినా, నేటికీ మన దేశంలో ఆ వలస కాలపు క్రూర చట్టాలు యథేచ్ఛగా అమలవుతుండటం విచారకరం. ఇవి సామాన్య ప్రజల మీద, హక్కుల కార్యకర్తలపై ఆయుధాలుగా వాడబడుతున్నాయి. జర్నలిస్టులను, యాక్టివిస్టులను, విద్యార్థులను ఎలాంటి నిర్దిష్టమైన నేరం నిరూపించకుండానే నెలల తరబడి జైళ్ళలో ఉంచుతున్నారు. ఇది మనం గర్వంగా చెప్పుకునే స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యమా?సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కూడా స్పష్టంగా చెప్పింది సెడిషన్ చట్టాన్ని వలసపాలకులు భారతీయులను అణచివేయడానికి మాత్రమే వాడారని. నాడు మహాత్మా గాంధీ ఆ చట్టం కిందే శిక్షింపబడ్డారు. లోకమాన్య తిలక్ ఆ చట్టం కిందే జైలుకు వెళ్ళారు. దురదృష్టవశాత్తూ అదే నల్ల చట్టం ఇవాళ మన సొంత పౌరులపై, మన పాలకుల చేత అమలవుతోంది. ఇది ఏ విధంగా అభివృద్ధి? ఇది ఏ విధంగా న్యాయం? ప్రజాస్వామ్యం సమాజంలో బతికి ఉండాలంటే అది ఒక సుకుమారమైన పువ్వు లాంటిదని గ్రహించాలి. దానికి నిత్యం నీరు పోసి కాపాడాలి. ఆ నీరు మరేదో కాదు ప్రజల చైతన్యం, ప్రజల భాగస్వామ్యం, పౌరుల ధైర్యం. ప్రజలు మాట్లాడటం ఆపేస్తే, అన్యాయాన్ని ప్రశ్నించడం మానుకుంటే, రోడ్లపైకి వచ్చి నిరసన తెలపడం వదిలేస్తే ప్రజాస్వామ్యం అంతరించిపోతుంది. అది చనిపోయిన చోట క్రూరమైన నిరంకుశత్వం విలసిల్లుతుంది. చరిత్ర ఈ విషయాన్ని పదేపదే నిరూపించింది హిట్లర్ జర్మనీలో, స్టాలిన్ సోవియెట్ యూనియన్ లో, ముస్సోలిని ఇటలీలో ఇదే జరిగింది. ఆ చేదు పాఠాలు మన దేశానికి వర్తించవు అని ఎవరూ భ్రమపడకూడదు. కాబట్టి, ఈ రోజు ప్రతి పౌరుడూ గుండెలపై చేయి వేసుకుని ఒక ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలి. నిద్రావస్థలో ఉండి నిరంకుశత్వాన్ని మన ఇంట్లోకి ఆహ్వానించాలా? లేక మేల్కొని ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలా? హక్కులు అడగడం నేరం అని పాలకుల ముందు మోకరిల్లాలా? లేక హక్కులు అడగడమే ప్రజాస్వామ్యపు ఊపిరి అని ఎలుగెత్తి చాటాలా?జ్ఞాపకం పెట్టుకోండి మన నిజమైన శత్రువు బయట ఎక్కడో లేదు. నిజమైన శత్రువు మన మనసులో దాగి ఉన్న భయం. ఆ భయాన్ని జయించినప్పుడే మనం స్వేచ్ఛగా, నిర్భయంగా మాట్లాడగలం. ఆ మాట్లాడే స్వేచ్ఛ సజీవంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బతుకుతుంది. ప్రజాస్వామ్యం బతికినప్పుడే మన హక్కులు, మన పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి.కాబట్టి గళమెత్తండి. నిలదీయండి. నిరసించండి. హక్కులను పోరాడి సాధించుకోండి. ఇవి నేరాలు కావు ఇవి మీ ప్రాథమిక కర్తవ్యాలు. ఈ దేశం మీది. ఈ నేల మీది. ఈ ప్రజాస్వామ్యం మీది. దాన్ని కాపాడుకోవడం పౌరుడిగా మీ నైతిక బాధ్యత. ఏ అధికారమూ, ఏ చట్టమూ, ఏ సంకెళ్ళూ మీ మాట్లాడే హక్కును శాశ్వతంగా లాక్కోలేవు మీ గుండెల్లో ధైర్యం ఉన్నంత వరకు!

*ఇంక్విలాబ్ జిందాబాద్! హక్కులు మన హక్కు! ప్రజాస్వామ్యం అమర్ రహే!*

డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

## సిద్ధాంతాల సంగ్రామం నుంచి

# గుర్తింపు రాజకీయాలు



భారత రాజకీయ చరిత్రలో పశ్చిమ బెంగాల్ ఒక ప్రత్యేక అధ్యాయం. స్వాతంత్ర్య పోరాటం, విభజన విషాదం, శరణార్థుల వేదన, కార్మిక ఉద్యమాలు, వామపక్ష రాజకీయాల ఎదుగుదల, ప్రాంతీయ పార్టీల ప్రభావం, హిందుత్వ రాజకీయాల విస్తరణ-ఇలా దేశ రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవాలంటే బెంగాల్ చరిత్రను అధ్యయనం చేయక తప్పదు. ఎందుకంటే ఈ రాష్ట్రం కేవలం ఎన్నికల ఫలితాల ద్వారా మాత్రమే కాదు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సైద్ధాంతిక మార్పుల ద్వారా భారత రాజకీయాల దిశను ప్రభావితం చేసిన ప్రాంతంగా నిలిచింది.

బెంగాల్ చరిత్రను పరిశీలిస్తే విభజన గాయాలే ముందుగా కనిపిస్తాయి. బ్రిటిష్ పాలకుల 'విభజించి పాలించు' విధానం బెంగాల్ సమాజంపై తీవ్ర ప్రభావం చూపింది. మత ప్రాతిపదికన జరిగిన విభజన లక్షలాది కుటుంబాలను నిరాశ్రయులను చేసింది. స్వాతంత్ర్యం తర్వాత తూర్పు బెంగాల్ నుంచి వచ్చిన శరణార్థుల ప్రవాహం పశ్చిమ బెంగాల్ సామాజిక నిర్మాణాన్ని పూర్తిగా మార్చేసింది. నివాసం, ఉపాధి, విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాల కోసం శరణార్థులు చేసిన పోరాటం ఒక కొత్త రాజకీయ చైతన్యానికి పునాది వేసింది.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి చేసినప్పటికీ, శరణార్థుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోయాయి. పరిశ్రమలు, విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగినప్పటికీ గ్రామీణ పేదరికం, భూ అసమానతలు, ఆహార కొరత ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ పరిస్థితుల్లో రైతులు, కార్మికులు, శరణార్థుల మధ్య వామపక్ష భావజాలం బలపడింది. రాజకీయంగా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు ఉద్యమాలు ఎదగడానికి ఇదే ప్రధాన కారణమైంది.

నక్సల్బరి ఉద్యమం బెంగాల్ రాజకీయాల్లో మరో కీలక మలుపు. భూమి కోసం, సామాజిక న్యాయం కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపింది. ఎన్నికల రాజకీయాల ద్వారా మార్పు సాధ్యమా, లేక విప్లవ మార్గమే పరిష్కారమా అనే చర్చలకు నాంది పలికింది. ఈ సంఘటన భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని రెండు వేర్వేరు దిశల్లో నడిపించింది. ఒకవైపు పార్లమెంటరీ రాజకీయాలు, మరోవైపు సాయుధ పోరాట మార్గం అభివృద్ధి చెందాయి.

1977లో అధికారంలోకి వచ్చిన లెఫ్ట్ ఫ్రంట్ బెంగాల్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ యుగానికి శ్రీకారం చుట్టింది. భూసంస్కరణలు, పంచాయతీ వ్యవస్థ బలోపేతం, రైతు హక్కుల పరిరక్షణ, కార్మిక సంఘాల అభివృద్ధి వంటి అంశాల్లో వామపక్ష పాలన చారిత్రక ముద్ర వేసింది. ముఖ్యంగా "ఆపరేషన్ బర్గా" గ్రామీణ సమాజంలో శక్తి సంబంధాలను మార్చిన కార్యక్రమంగా గుర్తింపు పొందింది. భూమిని సాగు చేసే రైతుకు రక్షణ కల్పించడం ద్వారా వ్యవసాయ రంగంలో స్థిరత్వాన్ని తీసుకువచ్చింది.

అయితే ఏ రాజకీయ వ్యవస్థలాగే వామపక్ష పాలన కూడా కాలక్రమేణా వైరుధ్యాలను ఎదుర్కొంది. ప్రారంభంలో ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన వ్యవస్థ, తరువాత అధికార యంత్రాంగంలో భాగమైపోయిందనే విమర్శలు వచ్చాయి. గ్రామీణ స్థాయిలో పార్టీ ఆధిపత్యం పెరగడం, ప్రజా సమస్యల కంటే సంస్థాగత ప్రయోజనాలకు ప్రాధాన్యం పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. పరిశ్రమల అభివృద్ధిలో వెనుకబాటు, నిరుద్యోగం పెరుగుదల, యువత వలసలు కూడా ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి.సింగూర్, నందిగ్రామ్ సంఘటనలు ఈ అసంతృప్తికి ప్రతీకలుగా మారాయి. రైతు హక్కుల కోసం పోరాడి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, పరిశ్రమల కోసం భూముల స్వాధీనం విషయంలో రైతుల ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి రావడం ఒక పెద్ద రాజకీయ వైరుధ్యంగా నిలిచింది. ఈ సంఘటనలు వామపక్షాల నైతిక ఆధిక్యాన్ని దెబ్బతీశాయి. ప్రజలతో ఏర్పడిన దూరం చివరకు అధికార మార్పుకు దారి తీసింది. ఈ పరిస్థితులను సమర్థంగా వినియోగించుకున్న తృణమూల్ కాంగ్రెస్ 2011లో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ నాయకత్వం బెంగాల్ రాజకీయాల్లో కొత్త దశకు నాంది పలికింది. ప్రజా సంక్షేమ పథకాలు, మహిళల సాధికారత, ప్రాంతీయ గౌరవం వంటి అంశాలపై దృష్టి సారించడం ద్వారా తృణమూల్ విస్తృత ప్రజాదరణ పొందింది. "మా-మాటి-మానుష్" నినాదం ప్రజల్లో బలమైన అనుబంధాన్ని సృష్టించింది.

అయితే అధికార మార్పు జరిగినప్పటికీ రాజకీయ సంస్కృతి పూర్తిగా మారలేదనే విమర్శలు కొనసాగాయి. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, స్థానిక స్థాయిలో అధికార దుర్వినియోగం వంటి అంశాలు మళ్లీ చర్చనీయాంశాలయ్యాయి. ఒకప్పుడు వామపక్షాలపై వచ్చిన ఆరోపణలే కొత్త పాలకులపై వినిపించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్మాణాత్మక సమస్యలను సూచిస్తుంది. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ బెంగాల్‌లో తన రాజకీయ విస్తరణకు అనుకూల పరిస్థితులను గుర్తించింది. మత ధ్రువీకరణ, శరణార్థుల సమస్య, జాతీయత భావజాలం, అధికార వ్యతిరేకత వంటి అంశాలను వినియోగించుకుంటూ బీజేపీ తన బలాన్ని పెంచుకుంది. ఒకప్పుడు వర్గ రాజకీయాలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రంలో గుర్తింపు రాజకీయాలు ప్రధాన శక్తిగా మారడం భారత రాజకీయాల్లో జరుగుతున్న విస్తృత మార్పులకు ప్రతిబింబం.

ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే బెంగాల్ రాజకీయ చరిత్ర కేవలం పార్టీల మార్పుల కథ కాదు. అది సమాజంలో జరిగే లోతైన మార్పుల చరిత్ర. కాంగ్రెస్ జాతీయవాద పునర్నిర్మాణాన్ని ప్రతినిధ్యం వహించింది. వామపక్షాలు వర్గ రాజకీయాలను ముందుకు తెచ్చాయి. తృణమూల్ ప్రాంతీయ ప్రజాకర్షక రాజకీయాలను నిర్మించింది. బీజేపీ మత, జాతీయతా రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ మార్పులు కేవలం నాయకత్వ మార్పులు కాదు; సమాజంలోని భావజాల మార్పుల ప్రతిబింబం.

అయితే బెంగాల్ ప్రజల అసలు సమస్యలు మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు. నిరుద్యోగం, గ్రామీణ సంక్షోభం, వలసలు, మహిళల భద్రత, ఆర్థిక అసమానతలు, రాజకీయ హింస వంటి సమస్యలు ఇప్పటికీ సవాలుగానే ఉన్నాయి. ఎన్నికలలో ఎవరు గెలిచారన్నది కంటే ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడుతున్నాయన్నదే అసలు ప్రశ్న. ప్రజాస్వామ్యం కేవలం ఓటుతో ముగిసిపోదు. అది సామాజిక న్యాయం, ఆర్థిక అవకాశాలు, సమానత్వం, భద్రత, గౌరవంతో కూడిన జీవితాన్ని కల్పించినప్పుడే సార్థకమవుతుంది.పశ్చిమ బెంగాల్ అనుభవం భారతదేశానికి ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. ప్రజా ఉద్యమాల నుంచి దూరమైన ఏ రాజకీయ శక్తైనా క్రమంగా తన బలాన్ని కోల్పోతుంది. ప్రజల ఆర్థిక సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపలేకపోతే గుర్తింపు రాజకీయాలు ఆ ఖాళీని ఆక్రమిస్తాయి. సామాజిక అసమానతలు, నిరుద్యోగం, నిరాశలు పెరిగినప్పుడు మత, కుల, ప్రాంతీయ విభజనలు మరింత బలపడతాయి. అందుకే బెంగాల్ భవిష్యత్తు కేవలం ఒక పార్టీ విజయంతో లేదా మరో పార్టీ పరాజయంతో నిర్ణయించబడదు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురాగల రాజకీయ ప్రత్యామ్నాయం ఏమిటి? ప్రజాస్వామ్యం ఎంత బలపడుతోంది? సామాజిక న్యాయం ఎంతవరకు సాధ్యమవుతోంది? యువతకు ఉపాధి అవకాశాలు ఎంతవరకు లభిస్తున్నాయి? అనే ప్రశ్నలకే భవిష్యత్తు సమాధానం చెప్పాలి. అదే బెంగాల్ రాజకీయ ప్రయాణం మనకు నేర్పుతున్న అతిపెద్ద సత్యం.

- ఆర్కే వెంకట్ (సోషల్ బ్లాగ్ రైటర్)
- 8096480227

# క్రోనీ పెట్టుబడిదారీ విధానం

## ప్రజల సొమ్ముతో కార్పొరేట్ సామ్రాజ్యాల నిర్మాణం



*దేశంలో సంపద సృష్టి పేరుతో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే ఒక అసౌకర్యకరమైన ప్రశ్న మన ముందుకు వస్తుంది. ప్రభుత్వ ఆస్తులను కొనుగోలు చేసేంత, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేంత ఆర్థిక శక్తి కొద్దిమంది కార్పొరేట్ వర్గాలకు ఎలా సమకూరింది? ఇది కేవలం వ్యాపార ప్రతిభ, పారిశ్రామిక దూరదృష్టి ఫలితమా? లేక ప్రజల పొదుపులతో నిర్మితమైన బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ విధానాలు, ప్రజా సంపదల బదిలీ ద్వారా ఏర్పడిన ఆర్థిక కేంద్రీకరణ ఫలితమా? దేశ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న అసమానతలు, భారీ కార్పొరేట్ రుణాలు, మొండి బకాయిల మాఫీలు, పెరుగుతున్న ప్రభుత్వ అప్పులు ఈ ప్రశ్నలను మరింత పదునెక్కిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో అమలవుతున్న విధానాలు నిజంగా ప్రజల సంక్షేమానికే దోహదపడుతున్నాయా? లేక కొద్దిమంది ఆర్థిక శక్తుల ఎదుగుదలకు మార్గం సుగమం చేస్తున్నాయా? అనే చర్చ నేడు దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన చర్చగా మారింది.*

స్వాతంత్ర్యం సాధించినప్పుడు భారతదేశం ఒక పేద దేశం. సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండేది. దేశ నిర్మాణం కోసం ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ప్రభుత్వ బ్యాంకులు, ప్రజా రంగ సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రజల పొదుపులను సమీకరించి దేశ అభివృద్ధికి వినియోగించాలనే లక్ష్యంతో బ్యాంకింగ్ వ్యవస్థను విస్తరించారు. లక్షలాది మంది రైతులు, కార్మికులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు తమ కష్టార్జిత సంపాదనను బ్యాంకుల్లో జమ చేశారు. ఆ నిధులు దేశాభివృద్ధికి, పారిశ్రామిక పురోగతికి ఉపయోగపడాలని భావించారు.

అయితే దశాబ్దాల కాలంలో ప్రజల సొమ్ము కొద్దిమంది కార్పొరేట్ వర్గాల చేతుల్లోకి ఎలా చేరిందనే ప్రశ్న నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ముందు నిలిచిన అత్యంత కీలకమైన ప్రశ్న. ప్రభుత్వ ఆస్తులను కొనుగోలు చేసేంత సంపద కొన్ని కార్పొరేట్ సంస్థలకు ఎక్కడి నుంచి వచ్చింది? వేల కోట్ల రూపాయల విలువైన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ సంస్థలను సొంతం చేసుకునే స్థాయికి వారు ఎలా ఎదిగారు? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికితే బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ విధానాలు, రాజకీయ అధికారాలు, కార్పొరేట్ ప్రయోజనాల మధ్య ఏర్పడిన సంబంధాలపై దృష్టి పడుతుంది.

ప్రజాస్వామ్యంలో బ్యాంకులు ప్రజల సొమ్మును భద్రపరచే సంస్థలు మాత్రమే కాదు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంధనంగా పనిచేసే వ్యవస్థ. కానీ గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ స్థాయిలో కార్పొరేట్ రుణాలను మంజూరు చేయడం, ఆ రుణాలు తిరిగి వసూలు కాకపోవడం, చివరికి వాటిని మొండి బకాయిలుగా ప్రకటించడం సాధారణ ప్రక్రియగా మారిపోయింది. చిన్న రైతు కొద్ది వేల రూపాయల రుణం చెల్లించకపోతే నోటీసులు, వేలంపాటలు, ఆస్తుల జప్తులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కానీ వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న పెద్ద కార్పొరేట్ సంస్థలు దివాళా ప్రక్రియ పేరుతో భారీ మినహాయింపులు పొందుతున్నాయి.

దేశంలో మొండి బకాయిల సమస్య కేవలం ఆర్థిక అంశం కాదు. ఇది సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య సమానత్వం, ఆర్థిక నైతికతకు సంబంధించిన అంశం. ఒకవైపు సాధారణ ప్రజలపై పన్నుల భారం పెరుగుతుంటే, మరోవైపు కార్పొరేట్ రుణాలపై భారీ రాయితీలు ఇవ్వడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. బ్యాంకుల నష్టాలు చివరికి ప్రభుత్వంపై పడతాయి. ప్రభుత్వం ఆ నష్టాలను పూడ్చేందుకు ప్రజల పన్నుల సొమ్మును వినియోగిస్తుంది. అంటే కార్పొరేట్ నష్టాలను సామాన్య ప్రజలే భరిస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో అప్పులు సహజమైనవే. ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాల కోసం అప్పులు చేస్తాయి. కానీ ఆ అప్పులు ఎవరి ప్రయోజనాలకు వినియోగించబడుతున్నాయన్నది ముఖ్యమైన ప్రశ్న. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, సంక్షేమ కార్యక్రమాల కోసం అప్పులు చేస్తే అవి సామాజిక పెట్టుబడులుగా పరిగణించవచ్చు. కానీ అప్పుల ద్వారా సమకూరిన వనరులు ప్రధానంగా కొద్దిమంది కార్పొరేట్ వర్గాలకు లాభదాయకంగా మారితే ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయి. ఇటీవలి దశాబ్దాల్లో దేశ అభివృద్ధి అనే పేరుతో మౌలిక సదుపాయాల రంగంలో భారీ పెట్టుబడులు పెట్టబడ్డాయి. రహదారులు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు నిర్మించబడ్డాయి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, ఈ ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. గ్రామీణ పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా అసమానతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

దేశ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న పరిస్థితి ప్రజాస్వామ్యానికి కూడా సవాలుగా మారుతోంది. ఆర్థిక శక్తి రాజకీయ శక్తిని ప్రభావితం చేస్తుంది. రాజకీయ నిర్ణయాలు ఆర్థిక ప్రయోజనాల దిశగా మలచబడే ప్రమాదం పెరుగుతుంది. ఫలితంగా ప్రజాస్వామ్యం క్రమంగా ప్రజల పాలన నుండి పెట్టుబడిదారుల ప్రభావిత వ్యవస్థగా మారే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితినే అనేక ఆర్థికవేత్తలు క్రోనీ పెట్టుబడిదారీ విధానంగా అభివర్ణిస్తున్నారు.

క్రోనీ పెట్టుబడిదారీ విధానంలో మార్కెట్ పోటీ కంటే రాజకీయ సంబంధాలు ముఖ్యమవుతాయి. సామర్థ్యం కంటే అధికార కేంద్రాలకు దగ్గరగా ఉండటం ప్రయోజనాలను నిర్ణయిస్తుంది. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు, భూముల కేటాయింపులు, సహజ వనరుల వినియోగం అన్నీ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంతాలకు కూడా విరుద్ధం.

దేశ ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే బ్యాంకింగ్ వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. మొండి బకాయిలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రుణాల మంజూరులో జవాబుదారీతనం పెరగాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్ ప్రయోజనాల సాధన కేంద్రాలుగా కాకుండా ప్రజల ఆర్థిక అభివృద్ధికి సేవ చేసే సంస్థలుగా కొనసాగాలి. ప్రజల పొదుపులను రక్షించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత.

అలాగే అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు. విద్యలో పెట్టుబడులు, ప్రభుత్వ వైద్య రంగ బలోపేతం, పరిశోధన, ఉపాధి కల్పన, వ్యవసాయ రంగ అభివృద్ధి, సామాజిక భద్రతా పథకాల విస్తరణ కూడా అభివృద్ధి ప్రమాణాలే. రహదారులు నిర్మించడం ఎంత ముఖ్యమో, గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. విమానాశ్రయాల నిర్మాణం ఎంత అవసరమో, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత పెంపు కూడా అంతే అవసరం.

దేశ భవిష్యత్తు కొద్దిమంది కార్పొరేట్ సంస్థల లాభాల్లో కాదు; కోట్లాది ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఉంది. ప్రజల సొమ్ముతో నిర్మించిన వ్యవస్థలు ప్రజలకే ఉపయోగపడాలి. బ్యాంకులు ప్రజల నమ్మకానికి ప్రతీకలుగా నిలవాలి. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ఆర్థిక విధానాలను రూపొందించాలి. లేకపోతే సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతూ, అసమానతలు పెరుగుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రజల చెమటతో కూడిన ప్రతి రూపాయి దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి గానీ, కొద్ది మంది సామ్రాజ్యాల నిర్మాణానికి కాదు. ఇదే నేటి భారత ఆర్థిక వ్యవస్థ ముందున్న ప్రధాన సవాలు. ఇదే ప్రజాస్వామ్య భారతదేశం సమాధానం చెప్పాల్సిన అత్యంత కీలకమైన ప్రశ్న.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## నిమ్స్‌లో అరుదైన మెదడు కణితి శస్త్రచికిత్స విజయవంతం

- వైద్య బృందాన్ని అభినందించిన డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప



**ఖైరతాబాద్, జూన్ 6 (జనం సాక్షి) :** నిజాం ఇన్స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) న్యూరోసర్జరీ విభాగం వైద్యులు కంటి గవ్వ(ఐ సాకెట్) మార్గం ద్వారా మెదడు కణితిని తొలగించే అత్యాధునిక ఎండోస్కోపిక్ ట్రాన్స్‌ఆర్బిటల్ అప్రోచ్(ఈటీఓఏ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మెదక్ జిల్లా మధుర్ గ్రామానికి చెందిన మంగలి లత(50) అనే మహిళకు కంటి వెనుక భాగంలోని పుర్రె అడుగు ప్రాంతంలో మెదడు కణితి ఉన్నట్లు గుర్తించిన వైద్యులు, సాధారణ క్రానియోటమీకి బదులుగా కనుబొమ్మ మడత వద్ద చిన్న కోత చేసి ఎండోస్కోప్ సహాయంతో కణితిని పూర్తిగా తొల గించారు. ఈ శస్త్రచికిత్సలో 3డి న్యూరోనావిగేషన్, సీయూఎస్ఏ సాంకేతికతలను వినియోగించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకుని ఎలాంటి న్యూరోలాజికల్ సమస్యలు లేకుండా డిశ్చార్జ్ అయినట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు.ఈ చికిత్సను ఆరోగ్యశ్రీ, ముఖ్య మంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఆఫ్) పథకాల కింద ఉచితంగా నిర్వహించామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో దీనికి రూ.10 నుండి15 లక్షల వరకు ఖర్చవుతుం దని చెప్పారు. న్యూరోసర్జరీ అదనపు ప్రొ.డా.యర్ర గుంట తిరుమల్ మాట్లాడుతూ ఈ పద్ధతి ద్వారా పెద్ద గాయాలు లేకుండా సురక్షితంగా మెదడు కణితులను తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. శస్త్ర చికిత్సను న్యూరోసర్జరీ విభాగాధి పతి డా.వై.వంశీకృష్ణ నేతృత్వంలోని బృందం విజయవంతంగా నిర్వహించగా డైరెక్టర్ నగరి బీరప్ప వారిని అభినందించారు.

## గిరిజన సంక్షేమ శాఖ డైలీవైజ్ వర్కర్లకు సమాన వేతనాలు అమలు చేయాలి

- మంత్రుల హామీలు అమలు చేయకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- అచ్చంపేట సమావేశంలో డైలీ వేజ్ వర్కర్ల హెచ్చరిక

**అచ్చంపేట, జూన్ 6 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డైలీ వేజ్ వర్కర్లు డిమాండ్ చేశారు. అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిర్వహించిన సమావేశంలో వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 45 రోజుల పాటు సమ్మె నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో డైలీ వేజ్ వర్కర్ల జేఏసీ నాయకులతో చర్చలు జరిపి మూడు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలు ఇచ్చి చాలా కాలం గడిచినా ఇప్పటివరకు అమలు కాలేదని



ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా డైలీ వేజ్ వర్కర్లకు ఇప్పటికీ జీవో నెం.64 ప్రకారమే తక్కువ వేతనాలు చెల్లించడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం రూ.26,700 వరకు వేతనాలు అందుతుండగా, నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం కేవలం రూ.11,700 మాత్రమే చెల్లించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు. ఒకే శాఖలో, ఒకే విధమైన పనులు నిర్వహిస్తున్న కార్మికులకు వేర్వేరు వేతనాలు చెల్లించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పెరిగిన కార్మిక వేతనాలను గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లందరికీ ఒకే రకమైన వేతన విధానం అమలు చేయాలని, "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డైలీ వేజ్ వర్కర్లతో కలిసి ఉద్యమ కార్యాచరణ రూపొందించాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా జూన్ 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న డైలీ వేజ్ వర్కర్ల రాష్ట్ర సదస్సుకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో వర్కర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల సురేందర్, రాష్ట్ర నాయకులు దామోదర్, వెంకటేష్, రాంజీ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హోం ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఎల్లమ్మ సుధాకర్, అలాగే బాలమణి, చెన్నమ్మ, బుజ్జి, పద్మ, నీల, లక్ష్మి, సుజాత, షహీన్ బేగం, రాములమ్మ, లింగమ్మ, రామ్‌లాల్ పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికగా కొత్త ప్రభుత్వ పాఠశాలను స్థాపించాలి

**ముషీరాబాద్, జూన్ 6 (జనం సాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో జనాభా ప్రతిపాదికగా ప్రభుత్వ బడులను పెంచాలని, విద్యా కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని విద్యా హక్కుల కార్యకర్తలు పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు శనివారం హైదరాబాద్, బాగ్ లింగం పల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సామాజిక కార్యకర్తల వేదిక, బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ఆధ్వర్యంలో మహానగరంలో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ శాంత సిన్హా, తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్ పర్సన్ రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానగరంలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్లలో ఏర్పడిన 36 డివిజన్ల లో క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ప్రకారం 15 లక్షల జనాభాకు కేవలం 115 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, 40 ఉన్నత పాఠశాల మాత్రమే ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలో కేవలం 200 మంది విద్యార్థులు మాత్రమే నమోదై ఉన్నారన్నారు. ఈమధ్య జరిగిన కులగరణ సర్వే ప్రకారం పట్టణ జనాభాలో 6 నుండి 14 సంవత్సరాల బాలలు సరాసరి 13.7




శాతం ఉంటారన్నారు. అంటే ఈ 36 డివిజన్లో 15 లక్షల జనాభాకు రెండు లక్షల మంది బడికి వెళ్లే వయసు బాలు ఉంటే కేవలం 25 వేల మందికి 12 శాతం మాత్రమే సరిపడా ప్రభుత్వ పాఠశాల ఉన్నాయన్నారు. మిగతా విద్యార్థులంతా ప్రైవేట్ బడులలోనే చదువుకునే తప్పని పరిస్థితికి నెట్టబడ్డారన్నారు. చదువుల ఆర్థిక భారం అభ్యాసన సామర్థ్యాలు కూడా అంతంత మాత్రమే అని పలు సంస్థల నివేదిక ద్వారా తెలుస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబాలలో అధిక శాతం పేద అట్టడుగు వర్గాలకు చెందిన వారేననీ, అసంఘటిత కార్మికులు వలస కూలీలు గృహ కార్మికులు వీధి వ్యాపారులు తక్కువ ఆదాయం ఉద్యోగ వర్గాలే ఇందులో ప్రధానంగా ఉంటాయన్నారు. నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటు లో లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాల అధిక ఫీజులు, ఇతర విద్యా ఖర్చుల భారంతో ఈ కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మహానగరంలో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కొత్తగా ఏర్పడిన ప్రతి డివిజన్లో ప్రీ స్కూల్ నుండి ఇంటర్ వరకు మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను, దానికి అనుబంధ ఫౌండేషన్ స్కూల్ ను ఏర్పాటు తోపాటుగా ఉన్న బడులను అప్ గ్రేడ్ చేయాలన్నారు. అదేవిధంగా తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, భారతీయ సామాజిక కార్యకర్త ఆర్థికవేత్త డా. లుబ్నా సర్వత్, కోవా పీస్ నెట్వర్క్ కార్యనిర్వాహక సంచాలకుడు డా. మజాహర్ హుస్సేన్, పట్టణ అభివృద్ధి నిపుణులు సృజన యాదవ్, తెలంగాణ ఎన్ ఎస్ ఎస్ పి ఎం రవి కన్నెగంటి, తల్లుల సంఘం కన్వీనర్ బి భాగ్యలక్ష్మి, తెలంగాణ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ జి వేణుగోపాల్, ఎం వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ .వెంకట్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు, సామాజిక, పౌర సంస్థల, విద్యార్థుల కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవినాయక నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



**హయత్‌నగర్, జూన్ 6 (జనం సాక్షి) :** హయాత్ నగర్, లెక్చరర్స్ కాలనీ డివిజన్ లోని కాలనీ వాసులతో బీఆర్ఎస్ నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి ఆధ్వర్యం లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో అంతర్గత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధిలైట్లు, కాలనీ మధ్య కరెంటు లైన్-పోల్స్, మంచినీటి వసతి లైన్, సీసీ రోడ్లు, తదితర సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డిని కోరారు. వారు స్పందించి త్వరలోనే కాలనీ సమస్యలు పరిష్కరిస్తామని, కాలనీ అభివృద్ధి కోసం సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక నగర్ కాలనీ అధ్యక్షులు దొడ్డి లింగం, కాలనీ సభ్యులు కనకారావు, దుర్గాప్రసాద్, రమేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ



**చేవెళ్ల, జూన్ 6 (జనంసాక్షి) :** అగ్నిప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, ప్రాథమిక అగ్నిమాపక పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్‌వో రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని ప్రత్యక్ష డెమో ద్వారా వివరించారు. చిన్నపాటి ఘటనలను సకాలంలో నియంత్రిస్తే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫైర్ ఫైటర్ గోపాల్, శివుడు బ్యాంకు మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల విషయంలో తల్లిదండ్రులు పెద్ద పాత్ర వహించాలి

- జిల్లా ఎస్పీ జానకి

**మహమ్మదాబాద్, జూన్ 6 (జనంసాక్షి) :** బాలల హక్కుల పరిరక్షణ, భద్రత,వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాల పెంపునకు బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు.బాలల భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నాడు,మహమ్మదాబాద్ మండలం, నంచర్ల గేట్‌లోని పల్లవి ఆటేటోరియం తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన,బాల పంచాయతీ కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి జానకి,హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకునేలా బాల పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.బాలల భద్రత, విద్య,ఆరోగ్యం, పరిశుభ్రత,బాల్య వివాహాల నివారణ,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై బాల పంచాయతీ ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాల పంచాయతీల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే నైపుణ్యం,సమర్థవంతమైన సంభాషణా సామర్థ్యం, జట్టు భావన,సామాజిక బాధ్యత పెంపొందుతాయని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి,బాలల సంక్షేమ కార్యక్రమాల్లో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా భవిష్యత్తులో వారు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగే అవకాశాలు మెరుగుపడతాయని




అన్నారు.

**వాట్సప్ స్టేటస్ వల్ల నేరగాళ్లకు సమాచారం..**

మనం పెట్టుకునే వాట్సప్ స్టేటస్ వల్ల మన పిల్లల సమాచారం.నేరగాళ్లకు అందుతుంది.నేరగాళ్లకు వాట్స్అప్ స్టేటస్ చూసి నేరాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు.వాట్సప్ స్టేటస్ లో విద్యార్థుల ఫోటోలు పెట్టుకోవద్దన్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి.వివిధ కేసుల ఫైల్ని పరిశీలించారు.కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డిఎస్ ఆర్ బి డి.ఎస్.పి, రమణ రెడ్డి,సీఐ గాంధీ నాయక్, సిడబ్ల్యుసి చైర్మన్ నైముద్దీన్, సిసిఎస్,ఇనిస్పెక్టర్ కృష్ణయ్య,ఉమెన్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ సైదారావు,డిప్యూటీ డీఈవో శ్రీనివాస్, తాసిల్దారు విద్యాసాగర్ రెడ్డి,ఎంఈఓ రాజు నాయక్,ఎంపీడీవో నరేందర్ రెడ్డి,ఎస్ఐ శేఖర్ రెడ్డి,కేఎం నారాయణ, వివిధ గ్రామ సర్పంచులు, విద్యార్థులు, వివిధ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా చర్యలు

- ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**అచ్చంపేట, జూన్ 6 (జనం సాక్షి) :** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్నిక్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వారి అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వరి తూకం, నాణ్యత పరీక్షలు, రికార్డుల నిర్వహణ, చెల్లింపుల ప్రక్రియను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ధాన్యం తడిచిందా..? ఇంకా ఎంత ధాన్యం కాంటా వేయాలి? కల్లాల్లో ఇంకా ఎంత ధాన్యం ఉంది..? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు, పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా, సత్వరంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని, కేంద్ర నిర్వాహకులు, అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని కలెక్టర్ పరిశీలించి, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్టేడియం వినియోగం, నిర్వహణ, అభివృద్ధి అవకాశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు క్రీడా సదుపాయాలు మరింత మెరుగ్గా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ మురళి, అచ్చంపేట తాహసిల్దార్ సైదులు సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**గద్వాల నడిగడ్డ, జూన్ 6 (జనం సాక్షి) :** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నీట్-2026 పునఃపరీక్ష నిర్వహణకు సంబంధించి ఢిల్లీ నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలంగాణ ఇన్చార్జి అభిషేక్ సింగ్, హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన పరీక్ష అని పేర్కొన్నారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈసారి పరీక్ష నిర్వహణలో గోప్యత, భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది అభ్యర్థులు 208 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో అధిక సంఖ్యలో కేంద్రాలు ఉన్నందున ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.పరీక్షా




కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రబీలో వరి ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తయిందని మిగిలిన జిల్లాల్లో కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా సిఎస్ ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈనెల 9న పెరేడ్ గ్రౌండ్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్సులను పంపిణీ చేయడం జరుగుతుందని, అన్ని జిల్లాల నుంచి ఈ కార్యక్రమంలో సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫార్మ్ కుట్టించాలని, ఇప్పటికే ఆలస్యమైనందున ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ నీట్ పరీక్షను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 9న మహిళా సంఘాలకు హైదరాబాదులో జరిగే బస్సుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా నుంచి బయలుదేరే సభ్యులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య తరపున ఎలక్ట్రికల్ స్కూటీలు, ఆటో, సైకిల్స్ కొనుగోలు చేసి గట్టు మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషా తెలిపారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డీఎవో వీరప్ప, పౌర సరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, జూన్ 6 (జనం సాక్షి) :** ఎల్.బి.నగర్ బీ.ఆర్.ఎస్. పార్టీ మహిళా నాయకురాళ్ల ఆధ్వర్యం లో నిర్వహించిన సమావేశానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళల సాధికారత, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీ తరఫున మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తలు చేస్తున్న సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org ఆదివారం 07 జూన్ 2026

# లిక్కర్ ఫ్యాక్టరీ జల దోపిడిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- నది జలాలను అక్రమంగా తరలిస్తున్న ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ
- ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న కృష్ణానది నీరు
- నదీ జలాల అక్రమ తరలింపుపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**పెబ్బేరు జూన్ 6 (జనం సాక్షి) :** ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ జల దోపిడీపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పెబ్బేరు మండలంలోని రంగాపూర్ శివారులో గల ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ సమీపంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మీడియాతో మాట్లాడుతూ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ అక్రమ నీటి వాడకంపై గత కొన్ని నెలలుగా బీసీ పొలిటికల్ జేఏసీకి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణానది నీటిని అక్రమంగా వాడుకుంటున్నారని, అదేవిధంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలను కృష్ణా నదిలో కలుపుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చిందన్నారు. వేసవికాలంలో కృష్ణానది నీరు అడుగంటి పోవడంతో వ్యవసాయానికి కూడా క్రాఫ్ హాలిడే ఇచ్చారని, అంతేకాకుండా ఇటీవల జరిగిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు సైతం తాగునీటికీ ప్రజలు అనేక తంటాలు పడ్డారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి సందర్భంలో నది పక్కనే ఉన్న లిక్కర్ ఫ్యాక్టరీ కృష్ణానది జలాలను స్టోరేజ్ చేసుకొని, 30 హెచ్‌పీ, 40 హెచ్‌పీ మోటార్లతో అక్రమంగా ఫ్యాక్టరీకి తోడేస్తున్నారని మండిపడ్డారు. నిబంధన ప్రకారం నదీ జలాలను మొదటగా తాగడానికి, సాగు చేసుకోవడానికి వాడుకోవాలని, తర్వాతనే ఇతర అవసరాల కోసం ప్రభుత్వ అనుమతులతో వాడుకోవాల్సి ఉంటుందన్నారు. నేడు ప్రజలు తాగునీటికీ, రైతులు వ్యవసాయానికి నీరు లేక అల్లాడుతున్నారని, లిక్కర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం దర్జాగా జలదోపిడి చేస్తుందని విమర్శించారు. పట్టపగలు ఇంత జలదోపిడి జరుగుతున్న ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకోసం మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే స్పందించి కృష్ణానది జలాల అక్రమ తరలింపుపై సమగ్ర విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న కృష్ణానది నీటి వల్ల జీవరాసులు సైతం మృతి చెందుతున్నాయని, ఈ సమస్యపై చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసి జల దోపిడిని అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు దేవర శివ, బత్తుల జితేందర్, రామన్ గౌడ్, బీచుపల్లి సర్పంచ్, బీసిరెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు, ఆదామ్, రాజశేఖర్ గౌడ్, వీరేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధి, పరిశుభ్రత కోసం సమిష్టిగా కృషి చేయాలి



**మక్తల్, జూన్ 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సభ కార్యక్రమం విజయవంతగా నిర్వహించారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వ.వార్డు అభివృద్ధి, పరిశుభ్రత కోసం అందరూ కలిసి రావాలని కౌన్సిలర్ అలుకూరి పావని పిలుపునిచ్చారు. శనివారం వార్డు సభ సందర్భంగా వార్డులోని కీలక నాయకులు ప్రజలతో అధికారుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వార్డు పరిశుభ్రత రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఇంటి పరిసరాల ముందు తగు జాగ్రత్తలు, దోమలు, క్రిమి, కీటకాల నివారణకై తగు చర్యలు అంశాలపై, అత్యవసరమైన పనుల గురించి చర్చించారు. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వార్డులో శానిటేషన్, బ్లీచింగ్ పౌడర్, పాగింగ్ పనులు సత్వరమే చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలం, నాయకులు రామ్ నారాయణ, అలుకురి రవికుమార్, రాజశేఖర్, గంగాధర్, శంకర్, అత్తర్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ విష్ణు, జాకీర్, దేవేంద్రమ్మ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల జాగ్రత్తగా ఉండండి



**వీపనగండ్ల, జున్ 6 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండలంలోని నాగర్ల బండ తండలో గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యలు సమకాలీన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై జె. నరేష్ కుమార్ హాజరై ముఖ్యంగా సైబర్ నేరాలపై రైతులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు, బ్యాంక్ ఖాతాలు, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు వంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అపరిచిత కాల్స్, లింకులు, యాప్‌లు ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రైతులకు సూచించారు. ఈ గ్రామసభలో పలు ప్రజా సమస్యలు చర్చించారు. గ్రామ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్, గ్రామ ఉపసర్పంచ్ గ్రామస్థులు, రైతులు, కానిస్టేబుల్స్, సంబంధిత అధికారులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపూర్‌లో చేప ప్రసాదం పంపిణీ సర్వం సిద్ధం

- గత వంద సంవత్సరాలుగా చేప ప్రసాదం పంపిణీ
- ఉచితంగా అందజేస్తున్న ఆడెం బ్రదర్స్
- ఈనెల 8న మృగశిర కార్తె, చేప ప్రసాదం పంపిణీ



**సదాశివపేట, జూన్ 6 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆడెం బ్రదర్స్ తెలిపారు. గ్రామంలోని లోపలి కోట హనుమాన్ మందిరం వద్ద మృగశిర కార్తె ప్రారంభం కాగానే సాయంత్రం 8 గంటలకు చేప ప్రసాదం ఉచితంగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం నిజాంపూర్‌లో చేప మందు కోసం తెలంగాణలోని మెదక్, సిద్దిపేట్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, నల్గొండతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి చేప ప్రసాదం కోసం భారీ సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. చేప ప్రసాదం ఆస్తమా, ఉబ్బసం, దగ్గు, ఎలర్జీ నివారణ కోసం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 65వ జాతీయ రహదారిపై ఉన్న సదాశివపేట పట్టణంలో అన్ని రాష్ట్రాల బస్సులు నిలుపుతారని అక్కడి నుండి నిజాంపూర్ గ్రామానికి బస్సులతో పాటు ఆటోల సౌకర్యం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9396880163, 9652424833, 7288866624 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## కల్వకుర్తి ఇందిరానగర్‌లో ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

- హర్షం వ్యక్తం చేసిన ఇందిరానగర్ కాలనీవాసులు



**కల్వకుర్తి రూరల్, జూన్ 6 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణంలో శనివారం ఇందిరానగర్ 20వ వార్డులో ప్రజల నివాసాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు సహకరించిన కల్వకుర్తి శాసనసభ్యులుకసిరెడ్డినారాయణరెడ్డికి, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్‌కి స్థానిక కౌన్సిలర్ చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తికి స్పందించిన ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపునకు చర్యలు తీసుకోవడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ లలితా శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చిత్తారి శ్రీనివాసులు - ఎల్లమ్మ, పద్మచిన్న తదితరులు ప్రజల తరఫున ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ మరియు సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సమస్య పరిష్కారానికి సహకరించిన ప్రజాప్రతినిధులను కాలనీవాసులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదే విధంగా స్పందించాలని కోరారు.

## జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూన్ 6 (జనంసాక్షి) :** మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్, 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని లారీలు అన్ని కొనుగోలు కేంద్రాల నుండి వడ్లు తరలింపుకే పెట్టాలని ఆర్టీవోను ఆదేశించారు. తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేవిధంగా చూడాలని సూచించారు. వనపర్తి జిల్లాలోని 15 మండలాల మహిళా సమాఖ్యలకు ఇప్పటికే 14 ఆర్టీసీ బస్సులు మంజూరు చేయడం జరిగింది. అన్ని బస్సులు ఆయా మండలాల నుండి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4.00 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని పి.డి డిఆర్డిఒ ఉమాదేవి ను ఆదేశించారు. మహిళలకు మార్గమధ్యంలో భోజనాలు, తాగు నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్ కుమార్, పి.డి డిఆర్డిఒ ఉమాదేవి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి రాణి, సివిల్ సప్లై సంస్థ మార్కెటింగ్ అధికారి ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పంటల అవశేషాలను కాల్చడం తగదు



**గద్వాల నడిగడ్డ, జూన్ 6 (జనం సాక్షి) :** పంటల అవశేషాల దహనం వలన భూమి సారం కోల్పోతుందనీ, వాయు కాలుష్యంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ ఛాంబర్ లో పంటల అవశేషాలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించే కరపత్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి మొండికాలు, ఇతర పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి విలువైన పోషకాలు నష్టపోవడంతో పాటు పంటలకు మేలు చేసే వానపాములు, సూక్ష్మజీవులు నశించి భూమి సారశక్తి తగ్గిపోతుందన్నారు. అవశేషాల దహనం ద్వారా కార్బన్ డైయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యాన్ని పెంచడమే కాకుండా శ్వాసకోశ వ్యాధులు, కంటి మంటలు, గుండె సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. అంతేకాకుండా జీవవైవిధ్యానికి నష్టం కలగడంతో పాటు గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను తగులబెట్టకుండా కంపోస్ట్ ఎరువుగా మార్చడం, మల్చింగ్ పద్ధతిని అనుసరించడం, హ్యాపీ సీడర్ వంటి యంత్రాలను వినియోగించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకుంటూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలి



**గద్వాల నడిగడ్డ, జూన్ 6 (జనం సాక్షి) :** ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ చెత్త నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు నినాద ఫలకాలు, బ్యానర్లు, పోస్టర్లతో నగరంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సరైన విధంగా నిర్వహించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌ను ప్రజలు సందర్శించి ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యుల్లత, ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగ్గారెడ్డి

- 210 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ



**సంగారెడ్డి టౌన్, జూన్ 6 (జనం సాక్షి) :** చిన్నారుల్లో ఉత్సాహం, ఆరోగ్యం, చదువు పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యంగా టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో శనివారం సంగారెడ్డి పట్టణంలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో 210 చిన్నారులకు ఉచిత సైకిల్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు విడతలవారీగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 400 మంది చిన్నారులకు సైకిళ్ళు మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేశామని అన్నారు. ఐదు సంవత్సరాలు మొదలుకుని 15 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు సైకిళ్ళు అందజేశారు. చిన్నారులకు, బాలురకు, బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్ళు అందజేశారు. గత వారం టోకెన్‌లు ఇచ్చిన వారికి శనివారం సైకిళ్ళు పంపిణీ చేశారు. టోకెన్ లు లేని చిన్నారుల కు మరోసారి సైకిల్‌లు పంపిణీ చేసేందుకు వీలుగా అందరి చిన్నారుల ఆధార్ కార్డు, పేరెంట్స్ ఫోన్ నెంబర్స్‌తో కూడిన వివరాలు తీసుకోవాలని జగ్గారెడ్డి నిర్వాహకులకు సూచించారు. సైకిళ్ళు రాని చిన్నారులు ఎవరు ఆందోళన పడవద్దని, పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ సైకిళ్ళు పంపిణీ చేస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, మహేష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5 (జనంసాక్షి) :** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం కూకట్‌పల్లి సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రిషి యూబీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతుల్లో అవగాహన ఫలకాలు పట్టుకుని ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, పర్యావరణ పరిరక్షణ అవసరం, పరిశుభ్రమైన పరిసరాల ప్రాముఖ్యత, ఏక వినియోగ ప్లాస్టిక్‌ను తగ్గించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు. సుమారు 100 మంది విద్యార్థినులు ర్యాలీలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.

# ప్రీ ప్రైమరీ కేంద్రాలను అంగన్‌వాడీలకు అప్పజెప్పాలి



**కృష్ణ, జూన్ 6 (జనం సాక్షి) :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకు అప్పజెప్పాలిని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, యూనియన్ సిఐటియు కృష్ణ మండలం నాయకురాలు మల్లమ్మ, సిఆర్ గోవింద్ రాజ్ సిఐటియు జిల్లా అధ్యక్షులు లీలావతి రాగసుధ డిమాండ్ చేశారు. శనివారం రోజు కృష్ణ మండ లం ఎంఈఓ నిజముద్దీన్, తాసిల్దార్‌లకు వేరువేరుగా వినతిపత్రులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఐటి యు జిల్లా అధ్యక్షులు గోవింద్ రాజ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగ న్వాడీల కేంద్రాలకు ఎసరు పెట్టే కార్యక్రమాన్ని కి పూనుకున్నదని విమర్శిం చారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లను, పిఎం శ్రీవిద్యను ప్రవేశపెడుతు న్నారని అన్నారు. అంగన్వా డీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పీఎం శ్రీవిద్య ను గ్రామాలలో అమలు చెయ్యమని వాటిని అంగ న్వాడీలకు అప్పజె ప్పాలన్నారు. అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు కనీస వేతనం 26 వేల రూపాయ లు ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ ఐ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 18 వేల రూపాయలు వేతనాలు ఇవ్వాలని హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లమ్మ, రాగ సుధా, లక్ష్మి, లీలావతి, మహేశ్వరి పి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ ప్రతినిధి, జూన్ 6 (జనం సాక్షి) : జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ, పట్టా భూముల హద్దుల నిర్ధారణ, గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన సర్వే, రీ-సర్వే కార్యక్రమాలు, చెరువుల శిఖం (వెట్‌ల్యాండ్స్) భూముల గుర్తింపు, కొలతలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కలెక్టర్, ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి కేసును బాధ్యతా యుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్యతో పాటు జిల్లాలోని 14 మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత శిబిరానికి ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

హనుమకొండ ప్రతినిధి, జులై 6 (జనం సాక్షి) : జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో మే 15 నుండి 25 వరకు నిర్వహించిన ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్సీసీ క్యాడెట్ శివకుమార్ పాల్గొని ఉత్తమ క్యాడెట్‌గా ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం తన ఛాంబర్‌లో శివకుమార్‌ను అభినందించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్యాడెట్ల మధ్య ప్రతిభ కనబర్చి ఉత్తమ క్యాడెట్‌గా గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరింత విస్తరించేందుకు శివకుమార్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావనలను పెంపొందించడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్సీసీ ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్




గుడిహత్నూర్ (జనంసాక్షి) : గుడిహత్నూర్ జాతీయ రహదారి 44 పై విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ పై మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహన నడిపిన ఉత్తరప్రదేశ్ చెందిన కంటైన డ్రైవర్ విజయ్ కుమార్ ను అరెస్టు చేసి రిమాండ్ క పంపినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈనెల నాలుగున సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుభాష్ రెడ్డి రహదారిపై ప్రమాదకరంగా నిలిచి ఉన్న కంటైనర్‌ను ప్రభుత్వ ట్యాబ్ తో ఫోటో తీసేందుకు ప్రయత్నించాడు ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ విజయ్ కుమార్ కానిస్టేబుల్ తో కూడా ఒకటి యూనిఫామ్ కాలర్ పట్టుకుని వెనక్కి నెట్టి విధులకు ఆటం కలిగించడం జరిగింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ దిలీప్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని సాక్షుల సమక్షంలో డ్రైవర్ కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేసి తదనంతరం ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్టు ఎస్సై తెలిపారు అతనికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించామని ఎస్ఐ తెలిపారు.


## భైంసా అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

- కలెక్టర్ భవేశ్ మిశ్రా



భైంసా, జూన్ 06 (జనంసాక్షి) : భైంసా మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేం దుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని, సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరద నివారణ, పట్టణ పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, మొక్కల నాటకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని, ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిం చాలని సూచిస్తూ, విద్వేషపూరిత పోస్టులు, అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బీఎల్‌ఏలకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ



- ఎన్నికల విజయానికి బీఎల్‌ఏలే బలమైన సైన్యం
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 6 (జనంసాక్షి): ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీ ఎల్ ఏ లు) కీలక పాత్ర పోషిస్తారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని ఓడ్డేపల్లి గార్డెన్‌లో నిర్వహించిన బీఎల్‌ఏల ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ, ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై ప్రతి బీఎల్‌ఏ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన మోహన్, నరేష్ రాథోడ్ లు బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు జాబితా నిర్వహణ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర శ్యామ్ నాయక్, మాజీ డిసిసి అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,జిల్లా గ్రంథాలయం చైర్మన్ అనిల్ కుమార్, డీసీసీ కార్యవర్గ సభ్యులు తారిక్, భీమ్రావు, గాదెవేణి మల్లేష్, విజయ్, శోభన్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కమల్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ములుగును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన
- పర్యాటక కేంద్రాలకు దీటుగా ములుగు పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, జూన్ 06(జనంసాక్షి) : ములుగును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని, పర్యాటక కేంద్రాలకు దీటుగా ములుగు పట్టణ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం ములుగు పట్టణంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్ఆర్ 2025-26 నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ములుగు పట్టణ పరిధిలో జాతీయ రహదారి-163 నుండి ఎరుకలవాడ వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, జాతీయ రహదారి-163 నుండి ఎస్సీ కాలనీ వరకు రూ.5 కోట్ల 75 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, అలాగే ములుగు పట్టణ తూర్పు ప్రాంతంలో రూ.5 కోట్ల 95 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ములుగు మున్సిపాలిటీ పరిధిలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ములుగు మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణాన్ని మరింత సుందరంగా, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ములుగు పట్టణాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన మున్సిపల్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రామప్ప, జంగాలపల్లి, మేడారం ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన జంక్షన్ల తరహాలో గట్టమ్మ జంక్షన్‌తో పాటు ములుగు బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, ఎంఆర్ఓ కార్యాలయం, కలెక్టరేట్ ఎదురుభాగం వంటి కీలక ప్రాంతాల్లో జంక్షన్ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రింగ్ రోడ్ నిర్మాణ ప్రతిపాదనపై పరిశీలన జరుగుతోందని, కలెక్టరేట్, యూనివర్సిటీ, దేవగిరిపట్నం ప్రాంతాలను అనుసంధానించే రింగ్ రోడ్ మార్గాలపై పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి అనుకూలమైన మార్గాన్ని ఎంపిక చేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు, గృహాలకు నష్టం కలగకుండా రహదారి అభివృద్ధి చేపట్టడం ద్వారా పట్టణంలో భారీ వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు ప్రత్యేక సందర్భాల్లో ట్రాఫిక్ మళ్లింపులకు కూడా సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, నాణ్యతతో సకాలంలో పూర్తి అయ్యేలా సహకరించాలని కోరారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ సంపత్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతి నిధులు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రతిపక్షాలను ఎదుర్కోలేక సవరణ పేరుతో ఓట్ల తొలగింపు

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది
- 9న ఉప ముఖ్యమంత్రితో విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం



స్టేషన్ ఘన్పూర్, జూన్ 06 (జనంసాక్షి) : బీజేపీ దేశంలో ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదు ర్కొలేక ఓట్ల తొలగింపుతో అధికారాన్ని కాపాడుకో వాలని ప్రయత్నాలుచేస్తోందని మాజీ ఉపముఖ్య మంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం నీడిగొండ లోని సత్య సాయి కన్వెన్షన్ లో నిర్వహించిన స్టేషన్ నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్స్ (బిఎల్ఏలు) శిక్షణ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వా మ్యం ఎన్నికల పైనే ఆధారపడి ఉందని ఎన్నికలు సక్రమంగా జరిగితేనే ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం కలుగుతుందని అన్నారు. అప్పుడే ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు చేసి ప్రభుత్వాలను ఎన్నుకుంటారని తెలిపారు. కానీ కేంద్రంలో ఉన్న ఎన్డిఏ ప్రభుత్వం అధికారాన్ని నిల బెట్టుకోవడానికి కులాలు, మతాల మధ్య విద్వేషా లు రెచ్చగొడుతుందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రతీ పక్షాల అనుకూల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ జరిగిన మూడు రాష్ట్రాల లో ఎన్నికలలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఓడి పోయారని వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనివాస్, బూత్ లెవల్ ఏజెంట్స్ ట్రైనర్ పి రాజ శేఖరరెడ్డి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరె డ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపాలిటీ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, జనగామ, హనుమ కొండ జిల్లాల కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధా న కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యు లు, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా అనుబంధసంఘాల అధ్యక్షులు, కార్యదర్శు లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, పీఏసీ ఎస్ ఛైర్మన్లు, దేవస్థాన కమిటీ ఛైర్మన్లు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, జూన్ 6 (జనంసాక్షి) : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటుకు సంబంధించి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ సహకారంతో జిల్లాలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఆర్‌సెటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ శిక్షణ సంస్థ ద్వారా సంప్రదాయ కోర్సులతో పాటు తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు, మత్స్య సంపద అభివృద్ధి, పాడి పరిశ్రమ, కంప్యూటర్, ఇతర సాంకేతిక ఆధారిత కోర్సులు, చిన్న వ్యాపారాల నిర్వహణ, సేవారంగానికి సంబంధించిన నైపుణ్య శిక్షణలను అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణలు యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉట్నూర్, నిజామా బాద్ జిల్లాల్లోని ఆర్‌సెటీ శిక్షణ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కోర్సులు, శిక్షణా విధానాలు, లబ్ధిదారుల ఎంపిక, ఉపాధి కల్పన అవకాశాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఆయా కేంద్రాల విధానాలను అధ్యయనం చేసి నిర్మల్ జిల్లాలో కూడా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుంది

- మరోసారి మోడీ ప్రధాని అవుతారు
- సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు




వరంగల్ బ్యూరో, జూన్ 06 (జనం సాక్షి) : ఎన్డీఏ ప్రభుత్వం మార్గదర్శకంగా పనిచేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం వాగ్దేవి కళాశాలలో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం పోగానే ఆస్తి పోయినట్లు కొందరు బాధపడుతున్నారని అన్నారు. కేటీఆర్ 2007లో రాజకీయంలో వచ్చారని ఇలాంటి వాళ్లు భూమిపుత్రులా అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని రఘునందన్ రావు అన్నారు. వడ్లు కిషన్ రెడ్డి ఇంటి ముందు పోస్తామని అనడం ఎంతవరకు సమంజ సంమన్నారు. యూపీఏ అధికారం లో ఉన్నప్పుడు 2004 నుంచి 2014 వరకు 4590 లక్షల మెట్రిక్ టన్నులు దాన్యం కొన్నదని దీనికి 4.44 లక్షల కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. అదే ఎన్ డి ఏ ప్రభుత్వంలో 2014 నుంచి 2025 వరకు 7608 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నట్టు తెలిపారు. దీనికి 14.16 లక్షల కోట్ల డబ్బులు చెల్లించినట్లు రఘునందన్ రావు తెలిపారు. ప్రస్తుతం ప్రతి గింజ కొంటాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొని తీరాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీని గద్దె దిగమనడం సమంజసం కాదన్నారు. వరి ధాన్యానికి 1310 రూపాయల నుంచి 2300 వరకు ఎంఎస్పీ చేసింది ఎన్డీఏ ప్రభుత్వం అని అన్నారు. వన్ రేషన్ వన్ నేషన్ తీసుకొచ్చింది కూడా ఎన్ డి ఏ ప్రభుత్వమని గుర్తు చేశారు. ఈ పథకం 2030 వరకు కొనసాగుతుందని తెలిపారు. 80 కోట్ల మందికి ఆహార భద్రత కలిగిస్తున్న ప్రభుత్వం ఎన్ డి ఏ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచైనా పోటీ చేయొచ్చని ప్రజాస్వామ్య బద్దంగా ఆయనకు ఆ హక్కు ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బిజెపి అధికార ప్రతినిధి రాని రుద్రమదేవి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, రత్నం సతీష్ షా , ఎరు కల రఘునారెడ్డి తదితరులఊ పాల్గొన్నారు.



## ప్రమాదకర కల్వర్టు సమస్యకు పరిష్కారం

ఏటూరునాగారం, జూన్ 06(జనంసాక్షి) : ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న కల్వర్టు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డులో కల్వర్టు పూర్తిగా ధ్వంసమై, రాకపోకలకు తీవ్ర ప్రమాదకరంగా మారిన విషయాన్ని స్థానిక ప్రజలు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువచ్చారు దీనిపై తక్షణమే స్పందించిన మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ప్రమాద తీవ్రతను స్వయంగా గమనించి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ స్థానిక వార్డు ప్రతినిధులు, గ్రామ ప్రముఖులతో కలిసి సదరు ప్రాంతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడు, తాడూరి రఘు, ఎండి ఖాజా పాషా, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు మాదరి మధు, కుమ్మరి చంద్రబాబు, ఎండి బాబా, కొండాయి చిన్ని, పెద్దబోన బాలకృష్ణ, ఎర్రల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్ట్ ను నమోదు చేయాలి

### నర్సంపేట ఆర్డీఓ ఆఫీస్ ముందు ధర్నా




నర్సంపేట మే 6 ( జనం సాక్షి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఈ సమయంలో వివిధ రకాల కంపెనీల పేర్లతో గ్రామాల్లో మండల డివిజన్ కేంద్రంలో రైతులకు విత్తనాలు అందజేస్తామని చెప్పి నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదం పొంచి ఉన్నదని దీనిని గుర్తించి ముందుగానే విత్తనాలు అమ్మే షాపులపై నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టాలని శనివారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మరియు అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ నాయకులు నర్సంపేట ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం ఆర్డీఓ ఉమారాణి కలిసి వినతి పత్రం అందజేశారు. విత్తనాల తయారీలో బడా కార్పొరేట్ సంస్థలు సామ్రాజ్యాగ సంస్థలు ఆదిపత్యం చెలాయిస్తున్నాయని రైతులకు విత్తనాలు వాతావరణ అనుకూలంగా లేనటువంటి విత్తనాలు అంటగట్టి లాభాలు పొందుతు న్నాయని ప్రభుత్వం ఇటువంటి సంస్థలపై నిఘా పెట్టి రైతుకు నష్టం జరగకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టి కృష్ణ .జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి. ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు. ఉపాధ్యక్షులు బొమ్మెడ సాంబయ్య. నాయకులు కుర్రి ఐలయ్య. భీమ గాని మల్లయ్య. ఇట్టబోయిన రవి. బుర్రి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి చేనేత కళకు ప్రపంచ గుర్తింపు

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 6 (జనం సాక్షి) :** పోచంపల్లి చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని అన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి థ్రెడ్" ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శించి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు, కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శించి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల భద్రత, విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

● డీజీపీ అభిలాష బిస్తూ

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 7 (జనం సాక్షి) :** పిల్లలు సురక్షితంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుందని, ప్రతి తల్లిదండ్రులు పిల్లల భద్రత, విద్య, నైతిక విలువల పెంపకానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్తూ అన్నారు. శనివారం కనగల్ మండలం చెర్లగౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లలకు విద్యతో పాటు కష్టపడే తత్వం, నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. భవిష్యత్తులో పిల్లలు క్రీడలు, కళలు, వృత్తి రంగాల్లో రాణించి దేశాభివృద్ధికి తోడ్పడతారని చెప్పారు. దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. బాల పంచాయతీలో విద్యార్థులు గ్రామ సమస్యలను ధైర్యంగా ప్రస్తావించడం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే పిల్లలు బాగా చదవాలని, తల్లిదండ్రులు వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సూచించారు. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలో చెత్త సమస్య, పాఠశాలకు బస్సు సౌకర్యం, కొత్త పాఠశాల భవనం, ఆట స్థలం వంటి అవసరాలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల చొరవను అభినందించిన ఆమె, ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, తల్లిదండ్రులు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని పిల్లలు అవగాహన కల్పించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, పోలీసు శాఖ చేపట్టిన బాల పంచాయతీ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీసే వేదికగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం 12 ఏళ్ల వయస్సులో ఉన్న ఈ చిన్నారులే 2047లో స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలను చూసే భావితరమని, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ, బాల పంచాయతీ ద్వారా విద్యార్థులు తమ



సమస్యలను నిర్భయంగా వెల్లడించారని తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి బాల పంచాయతీ నిర్వహించి, విద్యార్థులు తెలిపిన సమస్యల పరిష్కారంపై సమీక్ష చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, డీఎస్పీ శివరాం రెడ్డి, సీడబ్ల్యూఓ చైర్మన్ చింత కృష్ణయ్య, ఎంపీడీవో వేద, సర్పంచ్ చిలకరాజు సునీత వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కల్యూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో ఏసీబీ వలలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 6 (జనం సాక్షి) :** నల్లగొండ ఏసీబీ అధికారులకు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు వక్ఫబోర్డు ఇన్స్పెక్టర్ మహమూద్. పెద్దవూర మండలంలో మసీదు భూమి సర్వే నివేదిక పంపించేందుకు రూ.10 వేల లంచం డిమాండ్ చేసిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహమూద్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం, పెద్దవూర మండలంలోని 900 గజాల స్థలంలో ఉన్న మసీదు మరియు ఖాళీ స్థలం విషయంలో 2025 ఫిబ్రవరిలో సంబంధిత వ్యక్తులు వక్ఫ్ బోర్డు సీఈవోకు ఫిర్యాదు చేశారు. తమ మసీదు, ఖాళీ స్థలాన్ని వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై సీఈవో ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహమూద్, సర్వేయర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. అయితే సర్వే పూర్తి అయినప్పటికీ నివేదికను సీఈవోకు పంపకుండా నిలిపివేసిన ఇన్స్పెక్టర్, రిపోర్టు పంపాలంటే రూ.10 వేల లంచం ఇవ్వాలని బాధితుడిని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో మిర్యాలగూడ బస్టాండ్ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసి, ఇన్స్పెక్టర్ మహమూద్ రూ.10 వేల లంచం స్వీకరిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని నల్లగొండ వక్ఫ్ కార్యాలయంలో, అలాగే మిర్యాలగూడలోని అతని నివాసంలో ప్రత్యేక బృందాలతో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు వెంటనే ఏసీబీని సంప్రదించాలని సూచించారు. కేసుకు సంబంధించిన పూర్తి విచారణ అనంతరం సాక్ష్యాధారాలతో నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## వార్డు సభలతో ప్రజల వద్దకే పాలన

● మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్

**భువనగిరి, జూన్ 6 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభలు ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణాభివృద్ధికి వేదికలుగా నిలవాలని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని 14, 15, 17, 18, 19, 21, 25, 28, 30, 32 వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో భాగంగా 15, 28, 30, 32 వార్డుల సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక వార్డు సభ్యులు నాజియా రహమాన్ జహంగీర్, సుదగాని సరిత రాజు, ఎం.డి. లయీఖ్ అహ్మద్, బర్రె సంఘవి కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల్లో పౌర బాధ్యతలపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026 అమలు, జల్ సంచయ్--జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్రత, పూడికతీత పనులు, వర్షాకాల సంసిద్ధత, తాగునీటి సరఫరా, నీరు నిల్వ ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ,



రహదారుల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు తమ వార్డు అభివృద్ధిలో భాగస్వామి కావాలని, పరిశుభ్రమైన, హరిత భువనగిరి నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్ ప్రకారం మరో రెండు రోజుల పాటు వార్డు సభలు కొనసాగనున్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్



**హుజూర్‌నగర్, జూన్ 6 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని గోవిందాపురంలో 8, 9 వార్డుల పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేదల సంక్షేమానికి సన్న బియ్యం పథకమును ప్రవేశపెట్టారని తెలిపారు. పేదలకు గ్యాస్ సబ్సిడీ, ఉచిత బస్సు రవాణా సౌకర్యం, ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. స్మశాన వాటిక పనులు చేపడుతామన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గోవిందపురం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కమ్యూనిటీ హాల్లో ఫ్యాన్లను ఏర్పాటు చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హాలుకు వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 30 లక్షలు, ప్రభుత్వ పాఠశాల పనులకు అదనంగా మరో 20 లక్షలు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్మశాన వాటిక అభివృద్ధికి 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, కమిషనర్ సతీష్ కుమార్, 8 వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను, ఏఈ వినోదు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, విద్యుత్ ఎ.ఈ రాంప్రసాద్, ఆయుష డాక్టర్ చందన్ కుమార్, ఇందిరాల రామకృష్ణ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాజశేఖర్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలు



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 6 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం భువనగిరిలోని అరోరా కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ బాబు, ఇన్‌స్పెక్టర్ తేజం రెడ్డి, కానిస్టేబుల్ శ్రీహరి మరియు మహిళా కానిస్టేబుల్ మమత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలు గురించి తెలియజేస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రస్తుతం సమాజాన్ని ప్రభావితం చేస్తున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తత, వ్యక్తిగత సమాచారం రక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే మహిళల భద్రత, షీ టీమ్ సేవలు, మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన సదుపాయాలు గురించి వివరించారు. రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత గురించి కూడా వివరించారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



**రాజేంద్రనగర్, జూన్ 6 (జనంసాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను దారుణంగా హత్య చేసిన భర్తను పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ వివరాల ప్రకారం కుటుంబ కలహాలు, భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న భర్త ఈ ఘాతుకానికి పాల్పడినట్లు, అరెస్టైన నిందితుడు అవినాష్ ఇర్బాజీ కల్నే (37), ఆటో డ్రైవర్, మేస్త్రిగా పనిచేస్తూ అత్తాపూర్‌లోని తేజస్విని నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతురాలు సోని అలియాస్ కోమల్ అవినాష్ కల్నే. వీరికి 2013లో వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం జరిగిన మొదటి ఎనిమిదేళ్లు దంపతులు సంతోషంగా జీవించారు. అనంతరం అవినాష్ మద్యం సేవిస్తూ కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం ప్రారంభించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర విషయాలపై తరచూ గొడవలు జరిగేవి. ఇంటి పనిమనిషిగా పనిచేస్తూ కుటుంబాన్ని మృతురాలే పోషించేది. ఇదే సమయంలో భార్య ప్రవర్తనపై నిందితుడికి అనుమానం పెరగడంతో వివాదాలు మరింత తీవ్రమయ్యాయి. ఇప్పటికే 2025లో భార్య గొంతు నులిమేందుకు ప్రయత్నించిన కేసులో అవినాష్‌పై కేసు నమోదై జ్యుడీషియల్ రిమాండ్‌కు కూడా వెళ్లాడు. అయినప్పటికీ వారి మధ్య గొడవలు కొనసాగాయి. జూన్ 4వ తేదీ రాత్రి మరోసారి భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగగా, ఇంటి యజమాని మృతురాలి సోదరుడు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అయితే జూన్ 5వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో శ్యామల రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని గదిలోకి కిటికీ ద్వారా ప్రవేశించిన అవినాష్, కూరగాయల కత్తి, కూరగాయల తొక్కే పరికరం, ఇనుప సీకు సహాయంతో భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాల కారణంగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేకలు విన్న పొరుగువారు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగగా, నిందితుడిని 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కూరగాయల కత్తి, కూరగాయల తొక్కే పరికరం, ఇనుప సీకు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తును ఏసీపీ టి. శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె. నాగేశ్వరరావు పర్యవేక్షించగా, ఎస్ఐ పి. పార్వతి, కానిస్టేబుల్ కె. వీరేశ్ తదితరులు నిందితుడి అరెస్టులో కీలక పాత్ర పోషించారు. పోలీసు అధికారులు వారి సేవలను అభినందించారు.

## సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

● కలెక్టర్ దివాకర్ టీఎస్



**ఖమ్మం, జూన్ 5 (జనంసాక్షి) :** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పారిశుధ్య నిర్వహణ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ దివాకర్ టీఎస్ సూచించారు. తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్జీవోస్) జిల్లా శాఖ ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ను కలిసి హాస్టళ్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టల్ వెల్ఫేర్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించరాదని స్పష్టం చేశారు. పలు సమస్యలు ప్రస్తావనకు 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి హాస్టళ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్, ప్లంబింగ్ సిబ్బంది నియామకం, నిత్యావసర సరుకుల సరఫరా, కామన్ మెనూ అమలు, సపోర్ట్ స్టాఫ్ ఏర్పాటు, కళాశాల హాస్టల్ వాచ్‌మెన్‌ల పెండింగ్ వేతనాల విడుదల, విద్యార్థులకు వైద్య సేవల విస్తరణ తదితర అంశాలను టీఎన్జీవోస్ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సివిల్ సప్లైస్ బియ్యం, ఉచిత వస్తువులను నేరుగా హాస్టళ్లకు చేరవేయాలని కోరారు. వినతిపత్రంలోని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే మహిళ హత్య కేసు ఛేదన

**హాలియా, జూన్ 6 (జనం సాక్షి) :** త్రిపురారం మండల పరిధిలో వ్యవసాయ బావిలో కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైన మహిళ మృతదేహం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. శనివారం హాలియా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న త్రిపురారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహం వివరాల ఆధారంగా విస్తృతంగా విచారణ చేపట్టారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ఆదేశాల మేరకు హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. సతీష్ రెడ్డి పర్యవేక్షణలో త్రిపురారం ఎస్ఐ కె. నరేష్, పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్లు, కాల్ డేటా విశ్లేషణ, స్థానిక సమాచార సేకరణ మిస్సింగ్ కేసుల పరిశీలన ద్వారా మృతురాలు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలానికి చెందిన తిరుపతమ్మగా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నారాయణపేట జిల్లా పెద్దజాత్రం గ్రామానికి చెందిన బోయ కుల్లూరు లింగప్పను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతమ్మతో గత కొన్నేళ్లుగా పరిచయం ఏర్పడి సహజీవనం చేస్తున్న లింగప్ప ఇటీవల మరో వివాహం చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకున్నాయి. తిరుపతమ్మను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 29న త్రిపురారం గ్రామానికి తీసుకొచ్చి ఆమె చేతులను వస్త్రంతో కట్టి, గొంతు బిగించి హత్య చేసి మృతదేహాన్ని బావిలో పడవేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మృతురాలికి చెందిన సెల్ ఫోన్, తాళిబొట్లు తదితర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నప్పటికీ వేగంగా దర్యాప్తు చేసి కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్



అభినందించారు.

### మహిళలు అప్రమత్తంగా ఉండాలి

తెలియని వ్యక్తులతో పరిచయాల విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే కుటుంబ సభ్యులకు లేదా సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేసి సహాయం పొందాలని తెలిపారు.

## బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 6 (జనం సాక్షి) :** ఆరోగ్య సంరక్షణ కోసం డాక్టర్లు ఇచ్చే సలహాలను పాటించి ఆచరణలో పెడితేనే మనిషి జీవనశైలి దృఢంగా వుంటుంది అని ప్రముఖ వ్యాపారవేత్త కాళ్ళ పాపారావు, జూవీ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా మంచికంటి పంక్షన్ హల్ లో ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా జరిగింది. దీఎఖ మరియు జూవీ పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల శనివారం జరుగుతున్న నేపథ్యంలో శనివారం నాలుగు వందల పేషెంట్లకు బిపి, షుగర్, మూర్ఛ పేషెంట్లకు నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ ఛాతీ వైద్య నిపుణులు కాంట్రగడ్డ యమున పలువురు పేషెంట్లకు టెస్ట్ లు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా కాళ్ళ పాపారావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రతి నెలా పేదలకు ఉపయోగపడే విధంగా ఇలా ప్రతి నెల నెలా మెడికల్ క్యాంపు నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. తమ వ్యాపార సంస్థల నుంచి చాలా సందర్భాల్లో అనేక సేవా కార్యక్రమాల్లో తమ సహకారం అందించామని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు కు కూడా తమ సంస్థ నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జూవీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నారు అని ఆరోపించారు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆరోగ్య రంగానికి నిధులు ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు సి భారవి, పి సుబ్బారావు, జెట్ల రంగారావు, అడపా జయశ్రీ, వినుషా ఆధ్వర్యంలో ఉచితంగా టెస్ట్ లు అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై శ్రీనివాసరావు, పి ఝాన్సీ, ఎమ్ సుబ్బారావు, జె వెంకన్న బాబు, పి వాసు, వాసిరెడ్డి వీరభద్రం, పి శివనారాయణ, అఫ్జల్, ప్రమీల, విజయలక్ష్మి, సీతా రామశేఖరం, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# మాపై ఆరోపణలన్నీ అవాస్తవాలే

### రూ.15 లక్షల కోట్ల 'ఆదాయ గణాంకాల'పై రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్

**న్యూఢిల్లీ:**ఆదాయాలు ఎక్కువ చేసి చూపడం, ప్రభుత్వరంగ ఎల్‌ఐసీకి షేర్ల కేటాయింపులో అవకతవకలు వంటి ఆరోపణలను బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ తిరస్కరించింది. అవన్నీ ఊహాజనితాలే అని పేర్కొంది. మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ లేవనెత్తిన అంశాలకు, సమాధానం ఇచ్చే ప్రక్రియలో ఉన్నామని తెలిపింది. కొన్ని అంశాలపై లేవనెత్తిన అనుమానాలే సెబీ మధ్యంతర ఆదేశాల్లో ఉన్నాయని, నిర్ధరణ చేసిన విషయాలేమీ లేవని వివరించింది. వార్షికాదాయాలను భారీగా పెంచి చూపడం, నిధుల మళ్లింపు వంటి ఆరోపణల కింద రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోటరు, సీఈఓ రాజేశ్ మెహతాపై 'కంపెనీ సెక్యూరిటీల నిర్వహణ చేయకుండా' సెబీ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అయిదేళ్ల కాలంలో విదేశీ అనుబంధ కంపెనీల పేరిట (ముఖ్యంగా వాల్కంబి ఎస్‌ఏ) రూ.15 లక్షల కోట్ల మేర ఆదాయాలను పెంచి చూపినట్లు సెబీ తన 109 పేజీల మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. 'వాల్కంబి ప్రపంచంలోనే అతిపెద్ద, ప్రతిష్ఠాత్మక పసిడి రిఫైనరీ అని, ఇది బ్యాంకులు, కేంద్ర బ్యాంకులు, ఇతర బులియన్ కంపెనీలకు మేలిమి బంగారాన్ని విక్రయిస్తోందని' రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ తెలిపింది. కేంద్రం చెబితేనే ఎల్‌ఐసీ కొనిందా?.. కాంగ్రెస్: ఈ కంపెనీ వ్యవహారంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేసింది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్‌లో వాటా కొనుగోలు చేయమని ఎల్‌ఐసీకి కేంద్రం నుంచి ఆదేశాలు వెళ్లాయా అని ప్రశ్నించింది. బీఎస్‌ఈ గణాంకాల ప్రకారం.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్‌లో ప్రస్తుతం ఎల్‌ఐసీకి 11% వాటా ఉండటాన్ని గుర్తు చేసింది. శివ్ సేన యూబీటీ నేత ప్రియాంక చతుర్వేది సైతం రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ వ్యాపార నమూనాను ప్రశ్నించారు. పీఎల్ఐ పథకం కింద 5 గిగావాట్‌హవర్ తయారీ సామర్థ్యంతో ఈవీ (విద్యుత్తు వాహన) బ్యాటరీల్లోకి ఈ కంపెనీ ఎలా అడుగుపెట్టిందో తెలపాలన్నారు.



# రూపాయికి చికిత్స

- చమురు అనిశ్చితుల మధ్య కీలక రేట్లు యథాతథంగానే
- వృద్ధి అంచనాలు కిందకు, ద్రవ్యోల్బణ అంచనాలు పైకి
- పరిశీలనలో పాలిమర్ నోట్ల ప్రతిపాదన ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష

**న్యూఢిల్లీ:**"ఈ సారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండొచ్చన్న అంచనాలు నిజమైతే గ్రామీణ గిరాకీ, ప్రైవేటు వినియోగంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీన్ని తగ్గించడానికి చర్యలు తీసుకున్నా, ఇంధనం - ఇతర ముడిపదార్థాల ధరలు పెరుగుతున్నందున ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం పడొచ్చు. అవసరమైన వస్తువులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నా, వ్యయాలు అధికమవుతున్నాయి. మొత్తం మన వ్యవస్థపై ప్రభావం ఎంత ఉంటుందనేది, ఇరాన్ యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనే దానిపై ఆధారపడి ఉంది."అని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. అంచనాలకు తగినట్లుగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కీలక రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతూనే ఉన్నందున, వృద్ధిరేటు, ద్రవ్యోల్బణానికి ఇబ్బందులు తలెత్తవచ్చన్న అంచనాల మధ్య రూపాయికి మద్దతునివ్వాలని నిర్ణయించింది. ఇందు కోసం విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి పలు చర్యలను ప్రకటించింది. 11 నెలల పాటు దిగుమతులకు సరిపడా విదేశీ మారకపు నిల్వలు ఉన్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

**అంతర్జాతీయ పరిస్థితుల వల్లే..**

బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తీసుకునే రుణాలకు వర్తించే వడ్డీ రేటు అయిన రెపో రేటును 5.25% వద్దే కొనసాగించాలని పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. తటస్థ ధోరణినీ కొనసాగించింది. వడ్డీ రేట్లను సవరించకపోవడం ఇది వరుసగా మూడోసారి. 'అంతక్రితం సంక్షోభాలతో పోలిస్తే, ఈసారి భారత్ బలమైన స్థూల ఆర్థిక మూలాలతోనే అంతర్జాతీయ అనిశ్చితిని ఎదుర్కొంటోంది. అయితే ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కమొడిటీ ధరలు, సరఫరా ఆటంకాలు పెరిగి ఆర్థిక వృద్ధి అంచనాలపై ప్రభావం చూపగలవ'ని శుక్రవారం విధాన నిర్ణయాల ప్రకటనల సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయని కమిటీ గుర్తించింది. అందుకే మరింత స్పష్టత వచ్చేవరకు రేట్ల సవరణ విషయంలో వేచిచూడాలని నిర్ణయించారు.

**ఆహార ధరలు పెరగొచ్చు**

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు స్తబ్దుగానే ఉన్నా, పెరుగుతున్న వ్యయాలు కాస్తా వేతనాలు, ద్రవ్యోల్బణ అంచనాలపై ప్రభావం చూపొచ్చు. సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు కావొచ్చన్న అంచనాలు (ఎల్ నినో) నిజమైతే.. రాబోయే నెలల్లో ఆహార ధరలు పెరగొచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

**2026-27లో జీడీపీ 6.6 శాతమే!**

ప్రస్తుత ఆర్థిక సంవత్సర జీడీపీ వృద్ధి అంచనాలను 6.6 శాతానికి ఆర్‌బీఐ సవరించింది. వృద్ధిరేటు 6.9 శాతంగా ఉండొచ్చని ఏప్రిల్‌లో అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2025-26కు అంచనా వేసిన 7.6 శాతంతో పోల్చినా ఇది తక్కువే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 5.1 శాతానికి పెంచింది. మూడో త్రైమాసికంలో ధరలు నెమ్మదించడానికి ముందు 5.9 శాతానికీ చేరొచ్చని అభిప్రాయపడింది. టోకు ద్రవ్యోల్బణం 4.7 శాతంగా నమోదు కావొచ్చని తెలిపింది. అంతక్రితం అంచనా 4.4 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువే. ఆర్‌బీఐ సహన శ్రేణి అయిన 2-6 శాతంలోనే ఉన్నా, అంతర్జాతీయ ఇంధన ధరలు, సరఫరా ఆటంకాలు కాస్తా వేతనాలు, ద్రవ్యోల్బణ అంచనాలను ప్రభావితం చేయొచ్చని ఆర్‌బీఐ తెలిపింది. విశ్లేషకుల అంచనా అక్టోబరు తర్వాత 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్ల పెంపును తాము అంచనా వేస్తున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యల వల్ల రూపాయిపై ఒత్తిడి తగ్గొచ్చనీ అన్నారు.

**'డిపాజిట్ల కోసం అలా చేయడం తప్పే'**

డిపాజిట్లను ఆకర్షించడం కోసం అప్పటికే నిర్ణయించిన వడ్డీ రేటు కంటే, బ్యాంకులు అధిక రేటు చెల్లించడం 'ఆమోదయోగ్యం కాద'ని సంజయ్ పేర్కొన్నారు. ఈ అంశంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పై





మాట్లాడడానికి నిరాకరించారు. ఈ బ్యాంక్ పెద్ద డిపాజిట్లను పొందడం కోసం, మార్కెటింగ్ వ్యయాల కింద చూపిస్తూ అదనపు మొత్తాన్ని చెల్లించిందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే చాలా బ్యాంకులు అలా చేస్తున్నాయంటూ ఆ ఆరోపణలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తోసిపుచ్చింది.

**'మిథోస్'కు సిద్ధంగా ఉన్నాం**

ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్‌కు చెందిన మిథోస్ ప్లాట్‌ఫాం కారణంగా ఎదురయ్యే సైబర్ భద్రతా ప్రమాదాలను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ పేర్కొన్నారు.

**పాలిమర్ నోట్ల విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదు**

పాలిమర్ కరెన్సీ నోట్లను ఆవిష్కరించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని ఆర్‌బీఐ తెలిపింది. ఆ ఆలోచన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందనీ, తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని సంజయ్ పేర్కొన్నారు. 'ఆ విషయంలో సానుకూల, ప్రతికూల అంశాలను బేరీజు వేసుకుంటున్నాం. అమలు చేయదగ్గ అంశమా కాదా అనీ పరిశీలిస్తున్నాం. ఒక్కసారి తుది నిర్ణయం తీసుకుంటే మీకు చెబుతామ'ని విలేకర్లతో అన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# 2026లో జీడీపీ వృద్ధి 7.7%

### జనవరి-మార్చిలో 7.8% ప్రభుత్వ గణాంకాలు

**న్యూఢిల్లీ:**గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దేశ వృద్ధిరేటు అంచనాలకు మించి రాణించింది. జీడీపీ వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. 2024-25 వృద్ధిరేటు 7.1 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువ. 2025-26లో స్థూల విలువ జోడింపు (రియల్ జీవీఏ) 7.9% వృద్ధిని సాధించింది. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2025-26 నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ వృద్ధి 7.8%, జీవీఏ 7.9 శాతంగా నమోదైంది. 2025-26లో స్థిర ధరల వద్ద వాస్తవ జీడీపీని రూ.323.12 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2024-25లో ఇది రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద, దేశ నామినల్ జీడీపీ 8.9% వృద్ధితో రూ.346.36 లక్షల కోట్లకు చేరిందని అంచనా. 2024-25లో ఇది రూ.318.07 లక్షల కోట్లు. స్థిర, ప్రస్తుత ధరల వద్ద తయారీ, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలు, స్టోరేజ్, ఆర్థిక సేవలు, స్థిరాస్తి రంగాలు రెండంకెల వృద్ధి సాధించి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28)లో భారత్ మళ్లీ 7% వృద్ధిరేటు సాధించొచ్చని వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28)లో భారత్ మళ్లీ 7% వృద్ధిరేటు సాధించొచ్చని ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటూ దేశ ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' వేగాన్ని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

# యాప్ ఆధారిత క్యాబ్ సేవల్లోకి వియత్నాం సంస్థ గ్రీన్ ఎస్ఎం

**న్యూఢిల్లీ:**భారత విపణిలో యాప్ ద్వారా క్యాబ్ సేవలు అందించేందుకు వియత్నాం సంస్థ విన్ గ్రూపునకు చెందిన విద్యుత్ ట్యాక్సీ సేవల సంస్థ గ్రీన్ ఎస్ఎం సిద్ధమైంది. తొలుత దిల్లీ- ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభించగా, క్రమంగా ఇతర మెట్రో నగరాలకూ సేవలు విస్తరిస్తామని తెలిపింది. ప్రీమియం వినియోగదార్లే తమ లక్ష్యమని గ్రీన్ ఎస్ఎం ఇండియా సీఈఓ బాచ్ టువాన్ అన్హ్ తెలిపారు. తమ వాహనాల లోపల, బయట సీసీ కెమేరాలు, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రైవర్లు, ప్రయాణికుల కోసం అత్యవసర సహాయ బటన్‌లు లాంటి పలు భద్రతా ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు.

# గురి తప్పకుండా శత్రువుకు చిక్కకుండా!


### అబ్బురపరిచే ఎస్‌యూ-57 యుద్ధవిమానం ప్రత్యేకతలివి..



**న్యూఢిల్లీ:**తమ అమ్ములపొదిలోని అత్యాధునిక సుఖోయ్ ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను భారత్‌తో కలిసి మరింత అభివృద్ధి చేసేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ముందుకొచ్చారు. వాటిని ఉమ్మడిగా ఉత్పత్తి చేద్దామనీ ప్రతిపాదించారు. ఇంతకీ ఎస్‌యూ-57 ప్రత్యేకతలేంటి? అమెరికా వద్ద ఉన్న ఐదో తరం యుద్ధ విమానాలతో పోలిస్తే దీని సత్తా ఎంత?రష్యా ఉపయోగిస్తున్న తొలి అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ-57. అమెరికాకు చెందిన ఎఫ్-22 రాప్టర్, ఎఫ్-35 లైటెనింగ్-2 యుద్ధ విమానాలకు దీటుగా దీన్ని అభివృద్ధి చేసింది. ఎస్‌యూ-57 బహుళ ప్రయోజనకర యుద్ధ విమానం. దీన్ని వినియోగిస్తూ గగనతలంలో ఆధిపత్యం చలాయించొచ్చు. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించొచ్చు. ఎస్‌యూ-57లు 2020లో అధికారికంగా రష్యా మిలిటరీ సర్వీసులో చేరాయి. ఎస్‌యూ-57 సింగిల్ సీటు యుద్ధ విమానం. ఇందులో రెండు శక్తిమంతమైన శాటర్న్ ఏఎల్-41ఎ ఫ్1 ఇంజిన్లు ఉంటాయి. రష్యా దీనికోసం ప్రస్తుతం ఏఎల్-51 ఎఫ్1 అనే అప్‌గ్రేడెడ్ ఇంజిన్‌ను సిద్ధం చేస్తోంది. ఎఫ్-35 లైటెనింగ్-2లో ఒకే ఇంజిన్ ఉంటుంది. ఇందులో ఆయుధాలను లోపల, బయట మోహరించవచ్చు. ఇది గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను, గగనతలం నుంచి భూతలంపై లక్ష్యాలను సులువుగా ఛేదిస్తుంది. ఒక్కో ఎస్‌యూ-57 ధర 35 మిలియన్ డాలర్ల నుంచి 50 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఒక్కో ఎఫ్-35 లైటెనింగ్-2 నిర్మాణానికి 80 మిలియన్ డాలర్ల నుంచి 100 మిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతుంది.

**మ్యాక్ 2.0 వేగంతో..**

ఎస్‌యూ-57 సూపర్‌సోనిక్ యుద్ధ విమానం. ఇది మ్యాక్ 2.0 గరిష్ఠ వేగంతో (ధ్వని కంటే రెట్టింపు వేగంతో) దూసుకెళ్తుంది. అంటే గంటకు దాదాపు 2,458 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ప్రపంచంలోకెల్లా అత్యంత వేగవంతమైన స్టెల్త్ యుద్ధ విమానమిదే. ఇందులో అత్యాధునిక రాడార్, సెన్సర్ వ్యవస్థలు ఉంటాయి. ఇదొక సూపర్ క్రూయిజ్ యుద్ధ విమానం. ఆఫ్టర్‌బర్నర్లను ఆన్ చేయకుండానే మ్యాక్ 1.3 వేగంతో దూసుకెళ్లగలదు. అందువల్ల ఇంధనం ఆదా అవుతుంది. స్టెల్త్ సామర్థ్యమూ మెరుగ్గా ఉంటుంది. అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలకు కూడా చిక్కకుండా ఇది ప్రయాణిస్తుంది. అమెరికాకు చెందిన ఎఫ్-35 లైటెనింగ్-2 గరిష్ఠ వేగం మ్యాక్ 1.6 మాత్రమే. ఇది ఏకబిగిన దాదాపు 1,900 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. ఎఫ్-35 లైటెనింగ్-2 ఒకసారి ఇంధనాన్ని నింపుకొంటే 1,100 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.



# ప్రజ్ఞానందకు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్‌ను గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అతడి ప్రతిభకు ఇదో కీలక మైలురాయి అంటూ ప్రశంసించారు. ప్రజ్ఞానంద భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సైతం యువ గ్రాండ్‌మాస్టర్‌ను అభినందించారు. ఈ అద్భుతమైన విజయం అతని అసాధారణ ప్రతిభకు, అచంచలమైన అంకితభావానికి, ఏళ్ల తరబడి చేసిన కృషికి నిదర్శనమన్నారు. ప్రపంచ వేదికపై అత్యుత్తమమైన ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేశాడని ప్రశంసించారు. ప్రజ్ఞానంద విజయం దేశంలోని ఎందరో యువ చెస్ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్నారు. నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద ఘనతకెక్కాడు. 20 ఏళ్ల యువ గ్రాండ్‌మాస్టర్‌కు ఇది రెండో నార్వే చెస్ టోర్నీ మాత్రమే. ఏడుసార్లు నార్వే చెస్ టోర్నీ విజేతగా నిలిచిన ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఈ టోర్నీలో ప్రజ్ఞానంద రెండుసార్లు ఓడించాడు. తొలి ఆరు రౌండ్లలో మూడింట్లో ఓటమిపాలైనప్పటికీ అద్భుతంగా పుంజుకున్న ప్రజ్ఞానంద.. వరుసగా నాలుగు విజయాలు సాధించాడు. ఇక చివరి రౌండ్‌లో మరో భారత స్టార్ గుకేశ్ ఓటమిపాలయ్యాడు. అతడిపై మాగ్నస్ కార్ల్‌సన్ విజయం సాధించాడు. గుకేశ్ 8 పాయింట్లతో చివరి స్థానానికి పరిమితమయ్యాడు.

**యావత్ భారతం గర్వపడుతోంది**
**- ప్రజ్ఞానందపై అదానీ ప్రశంసలు**

ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్‌ను గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించాడు. విశ్వనాథన్ ఆనంద్, గుకేశ్‌కు దక్కని నార్వే టైటిల్‌ను ప్రజ్ఞానంద సొంతం చేసుకోవడం విశేషం. 2013లో నార్వే చెస్ టోర్నీ మొదలైంది. ఇప్పటివరకు ఎక్కువగా మాగ్నస్ కార్ల్‌సన్ విజేతగా వస్తూ వచ్చాడు. ఈసారి మాత్రం హేమాహేమీలను ఓడించి మరీ ప్రజ్ఞానంద ఛాంపియన్‌గా అవతరించాడు. ఈ క్రమంలో అతడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ప్రత్యేకంగా అభినందించారు.

### ఓడిపోయి బాధలో ఉంటే.. లేచి నిల్చుని

# చప్పట్లు కొట్టమన్నారు

**కోల్‌కతా:**మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగిందని ఆరోపించారు. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని.. అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టంచేశారు. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా దీదీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారని విమర్శించారు. బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికి గానూ నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారని రితబ్రత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించిందని అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారని.. హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారని ఆరోపించారు. టీఎంసీలో అవినీతి బాగా పెరిగిపోయిందని.. దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 61 మంది ఎమ్మెల్యేలు తమతో ఉన్నారని.. రాబోయే రోజుల్లో మరికొంతమంది తమతో పాటు కలిసే అవకాశం ఉందన్నారు. కాగా టీఎంసీ పార్టీలోని చాలా మంది నాయకులు అభిషేక్ బెనర్జీ పనితీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. శుభేందు అధికారి సహా పలు నేతలు పార్టీనీ వీడి వెళ్లడానికి కూడా అభిషేక్ వైఖరే కారణమన్న ఆరోపణలూ ఉన్నాయి. మమత కష్టపడి క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మిస్తే.. అభిషేక్ తృణమూల్‌ను ఐ-పాక్ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టారని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు. పార్టీ ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఆయనేనని నిందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేనల్లుడి విషయంలో దీదీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.



# జులై మధ్య కల్లా భారత్-అమెరికా తొలి దశ ఒప్పందం

విశాఖపట్నం: మధ్యంతర వాణిజ్య ఒప్పందం పూర్తి దిశగా భారత్, అమెరికా కదులుతున్నాయని, జులై మధ్య కల్లా తొలి దశ ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అమెరికా బృందం దిల్లీలో ఈనెల 4 వరకు చర్చలు జరిపినట్లు మంత్రి గుర్తు చేశారు. 'వారిని నేను కూడా కలిశాను. పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలనూ పరిష్కరించుకుంటూ ముందుకెళుతున్నాం. కాబట్టి వచ్చే నెల మధ్య ప్రాంతంలో తొలి దశ ఒప్పందానికి అవకాశం ఉంది. ఒప్పందం అనంతరం ఇతర పోటీదార్లతో పోలిస్తే, అమెరికా నుంచి భారత్‌కు ప్రాధాన్యత లభిస్తుంద'ని వివరించారు.



# ఎదురెదురుగా ఢీకొన్న ట్రక్కులు

### పంజాబ్‌లో రోడ్డు ప్రమాదంలో 8 మంది ప్రయాణికుల దుర్మరణం

**చండీగఢ్(జనంసాక్షి):**పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమీ దేరాకు శనివారం ఉదయం ప్రయాణం మొదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది.

# లక్ష బొద్దింకలు సీజ్.. అసలేం జరిగిందంటే!

ఆస్ట్రేలియాలో అక్రమంగా బొద్దింకలు పెంచుతున్న కేంద్రంపై ఇటీవల అక్కడి అధికారులు దాడి చేశారు. దాదాపు లక్ష కీటకాలను సీజ్ చేశారు. న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రంలోని బథర్స్ట్ నగరంలో ఓ వ్యాపారి వీటిని అక్రమంగా పెంచుతున్నట్లు గుర్తించినట్లు స్థానిక పర్యావరణ, నీటి సంరక్షణ విభాగం వెల్లడించింది. ఒకేచోట ఈ స్థాయిలో బొద్దింకలను సీజ్ చేయడం దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొంది.సీజ్ చేసిన వాటిలో మడగాస్కర్ హిస్సింగ్, దుబియా జాతులకు చెందిన బొద్దింకలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానిక వన్యప్రాణులకు, జీవ వైవిధ్యానికి హాని కలిగించే ఇటువంటి బొద్దింకలను దిగుమతి చేసుకోవడం, పెంచడం, విక్రయించడం చట్టవిరుద్ధమని తెలిపారు.సాధారణంగా బొద్దింకలు ఒకటి నుంచి ఒకటిన్నర అంగుళం పొడవు ఉంటాయి. కానీ, మడగాస్కర్ హిస్సింగ్ మాత్రం బొద్దింక జాతుల్లో ప్రపంచంలోనే అతిపెద్దవి. ఒక్కోటి రెండు, మూడు అంగుళాల (5 నుంచి 8 సెం.మీ) పొడవు ఉంటాయి. మెరిసే గోధుమ రంగులో ఉండే ఈ కీటకాలు మనిషి చేతి వేలు కన్నా పెద్దవిగా ఉండటం విశేషం. అయితే, పెంపుడు సరీసృపాలకు ఆహారంగా వేసేందుకు ఇలాంటి పెద్ద సైజులో ఉండే బొద్దింకలను విక్రయిస్తుంటారని నిపుణులు చెబుతున్నారు.



# సింగరేణిలో తగ్గిన బొగ్గు నిల్వలు

- 26.51 లక్షల టన్నుల బొగ్గు స్టాక్ మాత్రమే..
- 2014-2024 మధ్య సగటున 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు
- సంపూర్ణ అవగాహన కోసమే సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన
- మెడికల్ బోర్డుపై బాధితులు, యాజమాన్యం ఫిర్యాదుతో ఏసీబీ విచారణ..
- మెడికల్ బోర్డు కేసులో ఇప్పటికే ఇద్దరి అరెస్టు




**గోదావరిఖని జూన్ 06 (జనంసాక్షి) :** 137 ఏళ్లుగా మైనింగ్ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ దశాబ్దాలుగా దక్షిణాదిలో పలు రాష్ట్రాలకు నిరాటంకంగా బొగ్గు రవాణా చేస్తోంది. ఇందుకోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా ప్రతి నిత్యం రవాణా అవుతోంది. 39 గనులు ఉన్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్ గా ఉండటం అత్యంత సహజం. ఈ ఏడాది కూడా సింగరేణి సంస్థలో ఈ నెల 4వ తేదీ వరకు 26.51 లక్షల టన్నుల బొగ్గు వివిధ ఏరియాల్లోని గనులు, సీహెచ్ పిల్లో నిలువగా ఉంది. ఇది గత పదేళ్ల స్టాక్ చరిత్రలో అత్యల్పం. స్టాక్‌గా ఉన్న బొగ్గును ఎప్పటికప్పుడు రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా అవసరమైన వినియోగదారులకు రవాణా చేస్తున్నారు.

**గతంలో సగటున 50 లక్షల నిల్వలు..**

ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరిగే నవంబరు నుంచి మే మాసాల మధ్య బొగ్గు నిల్వలు పేరుకుపోతూ ఉంటాయి. ఇలా ఉన్న బొగ్గు నిల్వలను పలు కారణాల వల్ల ఉత్పత్తి తగ్గిన సమయంలో వీటిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా థర్మల్ కేంద్రాలకు సరఫరా చేస్తూ రావడం ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తున్న ఆనవాయితీ. 2014 నుంచి కూడా ఇదే విధంగా బొగ్గు నిల్వలు ఉంటున్న విషయం గమనార్హం. 2015-16లో 70 లక్షల టన్నులు, 2016-17 లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డు అయింది. 2014 నుంచి 2024 వరకు సగటును 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సీహెచ్పీల వద్ద ఉన్న విషయం గమనార్హం.

**స్టాక్ అత్యవసరం కూడా..**

ముఖ్యంగా వర్షాకాలం కోసం కూడా బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరం. లేనిపక్షంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గును రవాణా చేయలేని పరిస్థితులు ఉంటాయి. థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలకు 15 రోజులపాటు సరిపడేలా కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచుతారు. తద్వారా వర్షాకాలంలో విద్యుత్ కేంద్రాలకు నిరాటంకంగా బొగ్గు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దేశంలో ప్రతీ బొగ్గు కంపెనీ వద్ద కూడా ఇలాంటి నిల్వలు ఉండటం అత్యంత సహజం.

**సైట్ విజిట్ సర్టిఫికేట్ ఎందుకు..?**

సింగరేణి కాలరీస్ లో ఓవర్ బర్డెన్ తొలగింపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అతి కీలకమైనది. సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు పొరలపై ఉండే పైమట్టి (ఓవర్ బర్డెన్)ను సకాలంలో తొలగించాల్సి ఉంటుంది. ఈ ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేపడతారు. సింగరేణి కాంట్రాక్టులను బహిరంగ టెండర్ల ద్వారానే కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కువశాతం ఓవర్ బర్డెన్ టెండర్లలో, కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక- గనుల పరిస్థితులు, సామాజిక-రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు మొదలైన వాటిని సమగ్రంగా అంచనా వేయకుండా టెండర్లలో పాల్గొంటున్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన, అంచనా లేక కొందరు కాంట్రాక్టర్లు ఓవర్ బర్డెన్ పనులను ఆపివేయడం లేదా మందకొడిగా నిర్వహించడం వంటివి చేశారు. దీని ఫలితంగా పనితీరు దెబ్బతిని, సింగరేణికి బొగ్గు ఉత్పత్తిలో నష్టం, కాంట్రాక్టర్లకు ఆర్థిక నష్టం జరుగుతూ, న్యాయ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. శ్రీరాంపూర్ ఓసీ-2 ప్రాజెక్టులో, శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీలో సైట్ను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను మధ్యలో వదిలేయడం జరిగింది. ఫలితంగా కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలకు విఘాతం కలిగింది.

**గత మెడికల్ బోర్డులపై ఏసీబీ విచారణ**

సింగరేణిలో డిపెండెంట్, కారుణ్య ఉద్యోగాల నియామకాల కోసం మెడికల్ బోర్డును కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యోగ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, పలువురు దళారులుగా మారి అమాయకులైన కార్మికులను మోసం చేస్తూ పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు ప్రక్షాళనలో భాగంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏసీబీ విచారణలో ఇద్దరు ఉద్యోగులను అరెస్టయ్యారు. వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఏసీబీ, మరోవైపు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా ఈ ఆరోపణలపై డిపార్ట్మెంటల్ ఎంక్వైరీని కొనసాగిస్తోంది.

# చేనేత కార్మికుల భవితకు ప్రభుత్వం బంగారుబాట

## చేనేత రంగానికి పూర్తి మద్దతు కొనసాగిస్తాం : మంత్రి ఉత్తమ్

- హైటెక్స్‌లో 'థ్రెడ్... పోచంపల్లి' ప్రదర్శన ప్రారంభం
- ప్రత్యక్ష మార్కెటింగ్, ఈ-కామర్స్ ద్వారా మార్కెట్ విస్తరణ
- మహిళల సాధికారతకు చేనేత రంగం కీలకమని వ్యాఖ్య



**శేరిలింగంపల్లి, జూన్ 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చేనేత కార్మికుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిర్దిష్ట ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మాదాపూర్ పరిధిలోని హైటెక్స్‌లో శనివారం నిర్వహించిన 'థ్రెడ్... పోచంపల్లి' ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను సందర్శించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వందకు పైగా చేనేత స్టాళ్లను పరిశీలించిన మంత్రి, అసలైన పోచంపల్లి చీరలు, వస్త్రాలు, సమకాలీన చేనేత ఉత్పత్తులను ఆసక్తిగా వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ మహిళల సాధికారతకు చేనేత రంగం కీలక భూమిక పోషిస్తోందని, ఈ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ చేనేత కార్మికుడూ తమ సంప్రదాయ వృత్తిని విడిచిపెట్టాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పోచంపల్లి చేనేత కార్మికులు తమ అద్భుత నైపుణ్యంతో ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని, వేలాది నేత కుటుంబాల కృషికి ఈ కార్యక్రమం ఒక నివాళిగా నిలుస్తుందని పేర్కొన్నారు.
చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ప్రత్యక్ష మార్కెటింగ్, ప్రత్యేక ప్రదర్శనలు, ఈ-కామర్స్ వేదికల ద్వారా మార్కెట్ ప్రాప్యతను మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనివల్ల ఉత్పత్తుల లాభాలు నేరుగా చేనేత కార్మికులకు చేరుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఛైర్మన్ దుడం వెంకట్ రమణతో పాటు పలువురు అధికారులు, చేనేత రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.



# రెవెన్యూ శాఖలో మహేశ్వర్ మహోన్నత సేవలు

- క్రమశిక్షణ, నిబద్ధతతో విధుల నిర్వహణ : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- అనేక క్లిష్టమైన రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపారు
- కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పదవీ విరమణ సన్మాన సభ

**కరీంనగర్ బ్యూరో, జూన్ 04 (జనంసాక్షి) :** తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీవో స్థాయి వరకు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆర్డీవో కుందారపు మహేశ్వర్ విశిష్టమైన సేవలు అందించారని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం రాత్రి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టీఎన్‌జీవో ప్రతినిధులు కలిసి మహేశ్వర్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్రమశిక్షణ, నిబద్ధత, ఓర్పు, పట్టుదలతో రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించిన మహేశ్వర్ అనేక క్లిష్టమైన రెవెన్యూ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు చూపారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, పరిపాలనా నైపుణ్యం ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని అన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో తహసీల్దార్‌గా, కలెక్టరేట్ ఏవోగా, అనంతరం కరీంనగర్ ఆర్డీవోగా పనిచేస్తూ, అత్యుత్తమ సేవలు అందించారని, ఎక్కడా విధులు నిర్వహించినా అక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. సామాన్య ప్రజల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరి మన్ననలు పొందిన అధికారి మహేశ్వర్ అని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, టీఎన్‌జీవో ప్రతినిధులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేరుశనగ విత్తనాలు తిన్న పందికొక్కులు

## రైతులను ఆగం చేసిన అధికారులు

- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- పొంతనలేని సమాధానంతో దాటవేస్తున్న వ్యవసాయ అధికారులు
- తవ్వినకొద్ది బయటకు వస్తున్న అవినీతి

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6 (జనం సాక్షి):** రైతన్న అంటే అందరికీ లోకువే.. నోరు తెరిచి అడగలేని బక్క రైతన్నను దోచుకోవడానికి దళారుల నుంచి ప్రభుత్వ అధికారుల వరకు అందరూ ముందు వరసలో నిలుచుంటారు. ఇదే క్రమంలో రైతులను దగా చేసిన అధికారుల అవినీతి బాగోతం బయటపడింది. వివరాలు లోకి వెళితే రైతులకు చేయూతనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రబ్బీ సీజన్ లో ఉచితంగా వేరుశనగ విత్తనాలను అందజేసింది. రైతులు నూనె గింజలను పండించడానికి అవగాహన కల్పించి వారిని ప్రోత్సహిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ మండలాల లో రైతులకు ఉచితంగా 50 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను సరఫరా చేసింది. కానీ క్షేత్రస్థాయిలో రబ్బికి ఉపయోగించే వేరుశనగ విత్తనాలు రైతులకు అందలేదు. వ్యవసాయ శాఖ అధికారులు మధ్యవర్తులతో మిలాఖత్ అయి ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలను స్వాహా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి కొడంగల్ తాండూర్ వికారాబాద్ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలలో వ్యవసాయ అధికారులు వేరుశనగ విత్తనాలను రైతులకు అందివ్వకుండా అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రాథమికంగా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలోని కొన్ని గ్రామాలను తీసుకుంటే దాదాపు కోటి 40 లక్షల ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కాజేసినట్లు మొదటగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ జిల్లాకు కేటాయించిన వేరుసెనగ ఉచిత సబ్సిడీ కొన్ని వందల క్వింటాలను కేటాయించింది. డి ఎల్ డి కింద 50% సబ్సిడీ విసిసి కింద 100% సబ్సిడీతో రైతులకు ఉచిత సబ్సిడీ కింద వేరుశనగ విత్తనాలను సరఫరా చేస్తున్నారు. ఈ సబ్సిడీ విత్తనాలను గత రబ్బి సీజన్ కు రైతులకు సరఫరా చేశారు. కేవలం పట్టేదారు పాసుబుక్ జిరాక్స్ కాపీలపై ఉచిత సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయడంతో వ్యవసాయ అధికారులకు వాటిని మాయం చేయడం సులువయింది. ఈ విషయమై దుద్యాల మండలం లగచర్ల రైతులు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలు వ్యవసాయ అధికారులు స్వాహా చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు లగచర్ల రైతుల ఫిర్యాదును దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ రబీ సీజన్ ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ పై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో వికారాబాద్ తాండూర్ పరిగి కొడంగల్ నియోజకవర్గం లోని కొన్ని మండలాలలో రైతులకు తెలియకుండానే వ్యవసాయ అధికారులు ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలను స్వాహా చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తుంది.

**అబ్బే అంతా ఉత్తుత్తనే... అంతా సక్రమమే అవినీతి లేదు**

ఈ విషయమై కొడంగల్ వ్యవసాయ శాఖ ఏడి శంకర్ దుద్యాల మండల ఏవో నాగరాజును ప్రశ్నించగా అబ్బే అంతా ఉత్తుత్తనే అంతా సక్రమంగానే పంపిణీ చేసాం అవినీతి ఎక్కడ జరగలేదని తెలియజేశారు. ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ అవినీతిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు ప్రశ్నించడంతో జిల్లా కలెక్టర్ కు సమగ్ర నివేదికను అందజేసినట్లు తెలియజేశారు. రైతు పట్టేదారు పాస్ బుక్స్ జిరాక్స్ తీసుకోకుండా ఎవ్వరికి ఉచిత సబ్సిడీ విత్తనాలను ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. స్థానికంగా కొందరు




వారి బంధువుల పట్టేదార పాస్ పుస్తకాల జిరాక్సులను తీసుకొని వచ్చి ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలను తీసుకువెళ్లినట్లు తెలియజేశారు. ఇలా ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేశారని ప్రశ్నిస్తే లెక్కలు చూసుకోలేదని దాటవేశారు. రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ పై కలెక్టర్ విచారణకు ఆదేశించినందున ఇంకా ఎన్ని కోట్ల విత్తనాలు మాయమయ్యాయి విచారణ అనంతరం బయటికి వచ్చే అవకాశం ఉంది. సబ్సిడీ విత్తనాలు మాయం చేసిన వ్యవసాయ అధికారులపై వేటుపడే అవకాశం ఉంది.

# తాళం వేసిన ఇంట్లో చోరీ.. ముగ్గురు అరెస్ట్

- బంగారు ఉంగరాలు, ల్యాప్‌టాప్ స్వాధీనం
- నిందితుల వద్ద 2.58 కిలోల గంజాయి సీజ్

**అల్వాల్, జూన్ 6(జనంసాక్షి):** తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురు యువకులను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు 2.58 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. తుర్కపల్లికి చెందిన పేరక రమేష్ కుమార్ ఇంట్లో మే 29 నుంచి జూన్ 1 మధ్య చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి 31 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డెల్ ల్యాప్‌టాప్, ఆపిల్ వాచ్‌తో పాటు నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
శుక్రవారం రెడ్డి ఎన్‌క్లేవ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కేటీఎం బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. జవహర్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ సలీమ్ (19), భాను ప్రకాష్ (19), మిద్దెపాక భరత్ కుమార్ (19)గా గుర్తించారు. వీరి నుంచి రెండు బంగారు ఉంగరాలు, వెండి నాణెం, వెండి పట్టీలు, డెల్ ల్యాప్‌టాప్, ఆపిల్ వాచ్‌తో పాటు కేటీఎం, పల్సర్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2.58 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో అల్వాల్ పోలీసులు ఛేదించినట్లు అధికారులు తెలిపారు.

# దళారీల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు

- అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుంది
- ల్యాండ్ పూలింగ్‌పై అభిప్రాయ సేకరణకు గ్రామసభ
- రైతుల సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం: ఆర్డీవో శ్యాం ప్రకాష్
- దుండిగల్‌లో అధికారుల సమక్షంలో రైతుల అభిప్రాయాల వెల్లడి



**నిజాంపేట్, జూన్ 06 (జనంసాక్షి) :** అసైన్డ్ భూముల విషయంలో మధ్య దళారీల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటుందని మల్కాజ్గిరి జిల్లా ఆర్డీవో శ్యాం ప్రకాష్ సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మండల పరిధిలో ల్యాండ్ పూలింగ్ అంశంపై శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. దుండిగల్ మండలంలోని సర్వే నంబర్లు 453, 454లో ఉన్న భూములను సుమారు 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం వ్యవసాయ సాగు కోసం 328 మంది రైతులకు అసైన్డ్ భూములుగా కేటాయించిందన్నారు. కాలక్రమేణా సాగునీటి కొరత, ఇతర కారణాల వల్ల కొందరు రైతులు తమ భూములను లీజుకు ఇవ్వడం లేదా విక్రయించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిందన్నారు.
అసైన్డ్ భూముల సమస్యపై రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. రైతుల అభిప్రాయాలను సేకరించి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ల్యాండ్ పూలింగ్ అంశంపై గ్రామసభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు తమ భూముల విషయంలో ఉన్న అభిప్రాయాలు, సూచనలను వ్రాతపూర్వకంగా అందిస్తే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని శ్యాం ప్రకాష్ తెలిపారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ముఖ్యంగా రైతులు తమ భూమిలో కొంత భాగం తమ ఆధీనంలోనే ఉండేలా చూడాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తమ అభిప్రాయాలను అధికారులకు వివరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర క్యాంపెయినింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లద్దిపీర్ల నర్సింగ్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నంగి వెంకటేశం, మాజీ సర్పంచ్ కావలి గణేష్, తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, మండల ఆర్ఐ రవికుమార్, ఇతర అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సునీల్ రావు వ్యాఖ్యలు రాజకీయ స్వార్థమే: బీఆర్ఎస్

- బోయినపల్లి వినోద్ కుమార్ కృషిని గతంలోనే అంగీకరించారన్న హరిశంకర్
- రాజకీయ లబ్ధి కోసం వైఖరి మార్చుకుంటున్నారని విమర్శ
- అభివృద్ధి నిధుల ఖర్చుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్
- వినోద్ కుమార్, గంగుల కమలాకర్‌లపై వ్యాఖ్యలకు క్షమాపణ కోరిన బీఆర్ఎస్



**కరీంనగర్ టౌన్, జూన్ 6 (జనంసాక్షి) :**
రాజకీయ స్వార్థం కోసం అధికారంలో ఉన్న పార్టీల్లో చేరడం అలవాటుగా మార్చుకున్న వ్యక్తి మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. నగరంలోని 47వ డివిజన్‌లో గల 'మీకోసం' కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సునీల్ రావు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.
కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు సాధనలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారని హరిశంకర్ పేర్కొన్నారు. గతంలో ఇదే విషయాన్ని పలుమార్లు అంగీకరించిన సునీల్ రావు ఇప్పుడు భిన్నంగా మాట్లాడడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. కేంద్ర మంత్రుల సమక్షంలో సైతం వినోద్ కుమార్ కృషిని సునీల్ రావు స్వయంగా ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన వీడియోలు ప్రజల ముందే ఉన్నాయని చెప్పారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం తన వైఖరిని మార్చుకుంటూ వచ్చిన సునీల్ రావు ప్రస్తుతం కేంద్ర మంత్రులకు దగ్గరయ్యే ప్రయత్నంలో కొత్త కథనాలు చెబుతున్నారని విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మాటకు కట్టుబడి ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా అభిప్రాయాలు మార్చుకోవడం నాయకత్వ లక్షణం కాదన్నారు. పార్లమెంట్‌లో కరీంనగర్ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని చెప్పుకునే నాయకులు ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. దేవాలయాలకు ప్రత్యేక నిధులు, నవోదయ విద్యాలయం ఏర్పాటు, జాతీయ రహదారి అభివృద్ధి, డంప్‌యార్డు అభివృద్ధి వంటి అంశాలపై ఇచ్చిన హామీల అమలు పరిస్థితిని వెల్లడించాలని కోరారు. కరీంనగర్‌కే కాకుండా దేశంలోని అనేక నగరాలకు కేంద్ర పథకాల ద్వారా నిధులు వచ్చాయని, వాటిని ఒక వ్యక్తి లేదా ఒక పార్టీ ఘనతగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ప్రజల డబ్బుతో జరిగే అభివృద్ధి పనులను వ్యక్తిగత విజయాలుగా చూపించడం రాజకీయ ప్రచారంలో భాగమేనని విమర్శించారు. నగరంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడం, పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతుండటం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే నాయకులు ముందుగా ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.
కరీంనగర్ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లపై చేసిన వ్యాఖ్యలకు సునీల్ రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని హరిశంకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై నిరాధార ఆరోపణలు చేస్తే పార్టీ శ్రేణులు గట్టిగా ప్రతిస్పందిస్తాయని హెచ్చరించారు. గతంలో బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేసిన సునీల్ రావు, ఇప్పుడు పూర్తిగా భిన్నమైన వైఖరిని అవలంబిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం రంగులు మార్చే నాయకుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, రాజకీయ స్వార్థంతో చేసే ప్రయత్నాలను తిప్పికొడతారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మొక్కల సాగు

- నలుగురు వ్యక్తులపై కేసు నమోదు
- చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్



**చేవెళ్ల, జూన్ 06 (జనంసాక్షి) :** చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మొక్కల సాగు చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని చైత్ర రెస్టారెంట్ వెనుక ఉన్న ప్రీకాస్ట్ వాల్ తయారీ ప్రాంగణంలో కొందరు వ్యక్తులు నిషేధిత గంజాయి మొక్కలను పెంచుతున్నారని సమాచారం అందిన మేరకు పోలీసు బృందం, క్లూస్ టీం సమక్షంలో సదరు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అక్కడ నివాసముంటున్న నలుగురు వ్యక్తుల గదులను పరిశీలించగా ఒక ఎండిపోయిన గంజాయి మొక్క, ఒక సగం ఎండిన గంజాయి మొక్క లభించాయి. అనంతరం గదుల వెనుక భాగాన్ని తనిఖీ చేయగా మరో పచ్చి గంజాయి మొక్క నాటినట్లు గుర్తించారు. పోలీసులు, తహసిల్దార్ కృష్ణయ్య, క్లూస్ టీం సమక్షంలో స్వాధీనం చేసుకున్న మొక్కలను తూకం వేయగా ఒక ఎండిన మొక్క, సగం ఎండిన మొక్క కలిపి సుమారు 2.100 కిలోల బరువు ఉండగా, పచ్చి గంజాయి మొక్క సుమారు 1.050 కిలోల బరువు ఉన్నట్లు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను చట్టపరమైన విధానాల ప్రకారం సీజ్ చేసి సీల్ వేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి మీద ఎన్ డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సిఐ తెలిపారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల సాగు, వినియోగం విక్రయం ప్రజల ఆరోగ్యం, కుటుంబాలు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పోలీసు శాఖ ప్రజలకు సూచిస్తోందని అన్నారు. గంజాయి నిషేధిత మాదకద్రవ్యాల కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100 లేదా 112 కు సమాచారం అందించాలని సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.

# ప్రభుత్వ పథకాల సమాచారం ప్రజలకు చేరాలి

- చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి
- జల వనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 06 (జనం సాక్షి);**
ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుధ్య వాహనాలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామంలోని ప్రగతి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయం, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, జల సంరక్షణ, మహిళల రక్షణ, షీ టీమ్, భరోసా కేంద్రం తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని, బట్ట సంచులు ఇవ్వాలని, గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, జగ్గులు ఇవ్వాలని ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కింద 10 టీములతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని, డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని కోరారు.



ఘన వ్యర్థాల నిర్వహణ-2026పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్తగా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు పంపించాలని కోరారు. జల వనరులు సంరక్షించాలని, ఇంకుడు గుంతలు శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలని, చెరువులు, గ్రామంలోని ఇంకుడు గుంతలు, పామ్ పాండ్లు సిద్ధంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, సర్పంచ్ జ్యోతి, మిషన్ భగీరథ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి అవసరాలకు త్వరలో నిజాంసాగర్ నుంచి నీటి విడుదల

- ప్రజలలో అవగాహన పెంచేందుకు గ్రామ, వార్డు సభలు
- ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి
- పంటల మార్పిడి ఆవశ్యకతను గుర్తించాలి
- హుమ్నాపూర్ గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

**నిజామాబాద్ జిల్లా, జూన్ 6 (జనంసాక్షి):** సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వర్ని మండలం హుమ్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్థానిక సర్పంచ్ అప్పిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయజయహే తెలంగాణ గీతాలాపనతో సభకు శ్రీకారం చుట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉందని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల




తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు.
ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు.
వర్షాభావ పరిస్థితులు తలెత్తినా బోధన్, నిజామాబాద్ పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రానున్న రెండు రోజుల్లో నిజాంసాగర్ నీటిని విడుదల చేసి బెల్లాల్ చెరువులోకి మళ్లించడం జరుగుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఏసీపీ శ్రీనివాస్, డీఎల్‌పీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రశాంత్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం

**పచ్చదనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ బ్యూరో, జూన్ 06 (జనంసాక్షి) :** పచ్చదనం , పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలని, పైపులైన్ల మరమ్మత్తులు, ఓ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలని, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి వంటి చిన్న అంశాల పై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకు చెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బడిబాట గురించి వివరించారు.
హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ... సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు

- అందరూ భాగస్వాములు కావాలి..
- రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జూన్ 06 (జనంసాక్షి) :** కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అందరం కలిసి నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం డివిజన్ల క్లస్టర్ లెవెల్ వార్డు సభ యైటింక్లయిన్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఎల్.ఏ. ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ నేతృత్వం లో రామగుండంలో వేయి కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. రాబోయే వర్షాకాలంలో ఎలాంటి విపత్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గత రెండు నెలలుగా ఉదయమే డివిజన్ లలో పర్యటిస్తూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వరదలు రాకుండా కాలువల పూడిక తొలగింపు పనులు చేపడుతు న్నామని అన్నారు.
అలాగే అంటువ్యాధులు విజృంభించకుండా దోమల నివారణా చర్యలు కూడా చేపడుతున్నామని అన్నారు. నగరంలో ప్రతి చివరి ఇంటికి కూడా నీటి కొరత లేకుండా నిరంతరాయంగా రక్షిత మంచినీటిని అందించడానికి ఎంఎల్ఏ ఎం.ఏ.రాజ్ ఠాకూర్ రూ 100 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. రామగుండం ఎం ఆర్ ఓ రవీందర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సిస్టమాటిక్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) గురించి వివరించడంతో పాటు సర్ పై పలువురి సందేహాలను నివృత్తి చేశారు. నగర పాలక సంస్థ ఎసిపి శ్రీహరి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో నగర పాలక సంస్థ చేపట్టిన పనులతో పాటు మాన్ సూన్ కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు.ఐసిడిఎస్ అధికారులు తమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్యతో, కార్పొరేటర్లు షేక్ బాబు మియా, చుక్కల లావణ్య, బదావత్ శంకర్ నాయక్, బుర్ర శశికళ,మందల రమ, అనుమ స్వరూప, ద్యావనపల్లి చక్రపాణి, మారెల్లి సుశీల, తాళ్ల రాజయ్య, కందుల స్వరూప, కన్నూరి భాగ్యలక్ష్మి, బెంద్రం సునీత,డేవిడ్ రాజు, కౌటం సతీష్ , టూ టౌన్ సిఐ ప్రసాద రావు, నగర పాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టి ఎం సి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా.. నకిలీ విత్తనాలతో జరా జాగ్రత్త!

- మార్కెట్లో విచ్చలవిడిగా విక్రయాలు.. అధికారుల పర్యవేక్షణ కరువు
- గత ఏడాది మోసపోయి, నష్టపోయిన రైతులు..
- తనిఖీలు నిర్వహించి నకిలీ, కల్తీ విత్తనాలను అరికట్టాలి



**సదాశివనగర్, జూన్6 (జనంసాక్షి) :** వానాకాలం సాగు సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్లో విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే కొందరు వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది నకిలీ విత్తనాల బారిన పడి పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయి లబోదిబోమన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలు ఆశించిన దిగుబడి ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రైతులు నాణ్యమైన విత్తనాల కోసం దుకాణాలను ఆశ్రయిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు కొనుగోలు చేసే ముందు విత్తనాల ప్యాకెట్లపై కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, ధృవీకరణ గుర్తులు పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

### నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతులను మోసం చేస్తున్న షాపుల లైసెన్సులను రద్దు చేసి, దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి

విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాలపై వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. నాణ్యత లేని విత్తనాల వల్ల రైతులకు నష్టం కలగకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడంలో అధికారులు విఫలమైతే మరోసారి రైతులు భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెంపొందించాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

**గోదావరిఖని, జూన్ 06 (జనంసాక్షి) :**
నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు,ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడులు తదితర కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసులను వాదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఎన్‌బీడబ్ల్యూలు (ఎన్‌బిడబ్ల్యుఎస్), సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కేసులు విచారణలో ఉన్నప్పుడు కేవలం కోర్టుకు హాజరుకావడం మాత్రమే కాకుండా, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత ఎస్‌హెచ్‌వో, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎప్పటికప్పుడు సీసీలను పరిశీలిస్తూ, సాక్షులు మరియు ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యేలా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు తప్పకుండా ఉంటాయని పేర్కొన్నారు.మీ పనితీరుతోనే బాధితులకు న్యాయం చేస్తూ,పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది,కోర్టు లైజనింగ్ అధికారులను పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్,సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్,బాబురావు, ఎస్ఐ వినీత,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందు సేవించి చికిత్స పొందుతూ రైతు మృతి

- చేతికి వచ్చే సమయంలో రెండు ఎకరాల్లో ఎండిపోయిన వరి పంట..
- పేద రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం



**చిగురుమామిడి జూన్ 06(జనంసాక్షి):**
చేతికి వస్తుందనుకున్న వరి పంట సాగునీరు అందక ప్రతిసారి ఎండిపోతుండడంతో అప్పులు పెరిగిపోయి, ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందు సేవించి ఓ రైతు ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె పరిధిలోని బరిగెలపల్లిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పోలీసులు,గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బరిగెలపల్లెకు చెందిన పెసరు సదానందం(52) అనే రైతు తనకున్న రెండు ఎకరాల్లో వరి పంట వేశాడు.చేతికొచ్చే సమయంలో పంటలు ఎండిపోతుండడంతో అప్పుల ఊబిలో పడిపోవడం,ఇటీవల కూతురు వివాహం చేయడంతో మరిన్ని అప్పులు పెరగడంతో ఏం చేయాలో తోచక ఈ నేల 1న గతంలో తీసుకువచ్చిన గడ్డి మందు సేవించాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ చెప్పారు.బాధిత పేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఇందుర్తి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాస్, కార్యదర్శి కూన ముత్తయ్యలు కోరారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు**

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 06 (జనంసాక్షి) :**
రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా రాజేష్ చంద్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.
ఈ సమావేశంలో నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోళ్లు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై సమీక్షించారు.అ ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాల్లో 208 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు 72,956 మంది విద్యార్థులు హాజరుకానున్నందున అన్ని జిల్లాలు సమగ్ర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు.
అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో పరీక్ష నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రశ్నపత్రాల



రవాణా, అభ్యర్థుల నమోదు, బయోమెట్రిక్ ధృవీకరణ, తనిఖీలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4,488 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.13,577 కోట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు.
అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై నిరంతర నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని , మహిళా అభ్యర్థుల తనిఖీ కోసం ప్రతి కేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# ధర్మపురిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

- గోదావరిలో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర సాంఘీక క సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్

**ధర్మపురి జగిత్యాల జిల్లా జూన్ 06(జనంసాక్షి) :** ధర్మపురి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించి ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు.
శనివారం ధర్మపురి పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన మంత్రి అడ్లూరి గోదావరి పుష్కర ఘాట్లతో పాటు పట్టణంలోని పలు వార్డులను సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ వచ్చే గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని మంత్రి అన్నారు. ధర్మపురి పట్టణంలో ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ధర్మపురి డ్రైనేజీ నీరు గోదావరిలో కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్థానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

# అర్హులైన పేదలకె సంక్షేమ పథకాలు

- మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం
- కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్ బ్యూరో, జూన్ 06 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని కె.ఈ.ఎస్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన 11వ వార్డు సభలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 11 డివిజన్‌తో పాటు పలు వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల నరసన్న మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నదన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, వైద్య సేవలు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వడ్డీ లేని రుణాలను అందిస్తూ, మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. మహిళల అభ్యున్నతి ద్వారానే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు కరీంనగర్ నగర అభివృద్ధి పైన ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని ఆకుల నరసన్న తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల కోసం భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వార్డు సభలో 11వ డివిజన్‌కు చెందిన ప్రజలు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

**సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలు.. ఉద్యోగుల్లో మొదలైన ఆందోళనలు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని గత రెండు రోజుల క్రితం జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలకు ఆలయ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఆలయ అంతర్గత బదిలీల్లో భాగంగా ఇప్పటికే ఆయా శాఖల్లో అధికారుల బదిలీలు జరిగాయి.అయితే దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో రాజన్న ఆలయ ఉద్యోగుల్లో బదిలీల ఆందోళలు మొదలైయాయి.గత రెండేళ్ల క్రితం 6 ఏ ఆలయాల్లో చేపట్టిన ఉద్యోగుల బదిలీల్లో రాజన్న ఆలయంలో వున్న ఉద్యోగులలో 40 శాతం ఉద్యోగులు బదిలీ అయ్యారు.ఇక్కడి ఉద్యోగులు యాదగిరి గుట్ట, కొండగట్టు, భద్రాచలం,కొమురవెల్లి,బాసర ఆలయాలకు బదిలీపై వెళ్ళారు. అక్కడి నుంచి ఉద్యోగులు రాజన్న ఆలయానికి వచ్చారు.
మిగిలిన ఉద్యోగుల్లో సీనియారిటీ ప్రాతిపదికన 40 శాతం ఉద్యోగులు ప్రభుత్వ జీవో ప్రకారం బదిలీ కానున్నారు. ఇందులో 4 గురు ఏఈఓలలో ఒకరు,13 మంది సూపరింటెండెంట్లలో ముగ్గురు లేదా నలుగురు,14 మంది సీనియర్ అసిస్టెంట్లలో ఇద్దరు,28 మంది జూనియర్ అసిస్టెంట్లలో సుమారు 8 మంది బదిలీ అవడానికి అవకాశాలున్నాయి.గత రెండేళ్ల క్రితం ఇతర ఆలయాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉద్యోగులకు మినహాయింపు ఉండనుంది.

### బదిలీలు సరే..ఖాళీల భర్తీ ఎప్పుడో...!

రాజన్న ఆలయంలో ఉద్యోగుల బదిలీలు చేపడుతున్న ప్రభుత్వం,దేవాదాయ శాఖ అధికారులు ఖాళీల భర్తీలపై దృష్టి సారించడం లేదని ఉద్యోగ సంఘం నాయకులు ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తుంది. రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పదవి విరమణ పొందిన క్రమంలో కిందిస్థాయి సిబ్బందికి ప్రమోషన్లు ఇస్తూ భర్తీలు చేస్తున్నారు.చివరకు క్లాస్ ఫోర్ ఉద్యోగుల ఖాళీల భర్తీలు చేపట్టడం లేదు.ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం,దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
7 జూన్ 2026

# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త



- ముందస్తు చర్యలకు సిద్ధం కండి
- ధాన్యం కొనుగోళ్లు, సీఎం పర్యటనలపై జాగ్రత్తలు
- కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ ఆదేశాలు

**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# ప్రపంచస్థాయి షట్లర్లను తయారు చేయండి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- గోపీచంద్ సేవల పట్ల అభినందనలు
- గచ్చిబౌలిలో ఘనంగా ముగిసిన యోనెక్స్-సన్‌రైజ్ సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీ




**హైదరాబాద్, జూన్ 6 (జనంసాక్షి) :** ప్రపంచస్థాయి షట్లర్లను తయారు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా మే 29 నుంచి నిర్వహించిన యోనెక్స్-సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్-15, అండర్-17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 3,600 మందికి పైగా యువ షట్లర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వారం రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో భవిష్యత్ స్టార్ షట్లర్లు తమ నైపుణ్యాన్ని చాటుకుంటూ ప్రేక్షకులను అలరించారు. అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన ఆదిత్య సింగ్ నేగి ఛాంపియన్‌గా నిలవగా, బాలికల సింగిల్స్‌లో రాజస్థాన్‌కు చెందిన అన్వి రాథోర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తెలంగాణకు చెందిన హంసిని రన్నరప్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో అవని విజేతగా నిలిచింది. బాలుర డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన తాబిన్ అనుఫ్ అహ్మద్ ఎం.ఎఫ్- తెలంగాణకు చెందిన శ్రీచేతన్ శౌర్య శామల జోడీ అద్భుత ఆటతీరుతో విజేతలుగా నిలిచింది. బాలికల డబుల్స్‌లో కేరళకు చెందిన అలెక్సియా ఎల్సా అలెగ్జాండర్ - తమిళనాడుకు చెందిన జయ సప్తశ్రీ ఎం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మిజోరంకు చెందిన లియాన్‌సాంగ్పుయా - నాగాలాండ్‌కు చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సై జోడీ ఛాంపియన్‌గా అవతరించింది.

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత బ్యాడ్మింటన్ అభివృద్ధిలో జాతీయ ప్రధాన కోచ్ డా. పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వమని కొనియాడారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ వేదిక వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి దేశ క్రీడారంగానికి అమూల్యమైనదని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి షట్లర్లను తయారు చేసి భారత ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన గోపీచంద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. బ్యాట్ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ టోర్నీలో పాల్గొన్న యువ క్రీడాకారుల ప్రతిభను అభినందించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన షట్లర్లు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించారని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ముందుకు సాగితే భవిష్యత్తులో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందించే క్రీడాకారులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. విజేతలు, రన్నరప్ క్రీడాకారులను అభినందించిన వి చాముండేశ్వరి నాథ్ యువ క్రీడాకారుల విజయాల్లో కోచ్‌లు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కఠోర సాధనతో ముందుకు సాగుతున్న యువ షట్లర్లు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి.ఎన్. బాబు, బాయ్ కన్వీనర్ ఉమర్ రషీద్, బ్యాట్ ఉపాధ్యక్షులు వి. చాముండేశ్వరి నాథ్, బ్యాట్ సలహాదారు కొసరాజు లక్ష్మణ్, కోశాధికారి కె. వంశీధర్, బ్యాట్ సభ్యులు శ్రీనివాసరావు, మీడియా కోఆర్డినేటర్ రమణా రెడ్డి, స్పాన్సర్ రాజిరెడ్డి, గ్లోబల్ సొల్యూషన్స్ ప్రతినిధి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

- ఇప్పుడేమో హడావిడి చేస్తే ఎలా నమ్మాలి
- సిఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**మహబూబ్‌నగర్, జూన్6 (జనంసాక్షి) :** రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టటెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లపాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

# సింగరేణిలో 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

- సగటున 50 లక్షల టన్నులు ఉండాల్సింది
- కొన్ని ప్రాజెక్టుల్లో పనులు ఆగడంతో తగ్గిన ఉత్పత్తి
- సింగరేణి సంస్థ వివరణ

**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం బొగ్గు నిల్వలు, టెండర్ విధానాలు, ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే అందుబాటులో ఉందని సంస్థ తెలిపింది. గత 10 సంవత్సరాల్లో ఇదే అత్యల్ప స్థాయి స్టాక్‌గా నమోదు అయినట్లు స్పష్టం చేసింది. 2014-2024 మధ్య సగటు బొగ్గు నిల్వలు సుమారు 50 లక్షల టన్నులుగా ఉన్నాయని, అయితే ప్రస్తుత తగ్గుదల అసాధారణం కాదని.. ఇది సాధారణ ఉత్పత్తి, రవాణా పక్రియలో భాగమేనని సంస్థ తెలిపింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ అవసరాల కోసం కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు అవసరమని కూడా వివరించింది. ఓవర్ బర్డెన్ పనులకు టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసినట్లు సింగరేణి స్పష్టం చేసింది. సైట్‌ను ప్రత్యక్షంగా పరిశీలిం చకుండా కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేయడం, మధ్యలో నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. శ్రీరాంపూర్ -2 సహా కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని వివరించింది. ఈ కారణంగా మే 2025 నుంచి సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానం అమల్లోకి తీసు కొచ్చినట్లు తెలిపింది. మెడికల్ బోర్డు నియామకాల్లో అక్ర మాల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ విచారణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు అరెస్టులు జరిగినట్లు, సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అలాగే విజిలెన్స్ విభాగం కూడా అంతర్గత విచారణను కొనసాగిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం పేర్కొంది. మొత్తం వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని సంస్థ స్పష్టం చేసింది.

# మరో రెండు వారాలు హైడ్రా ప్రజావాణికి విరామం

- 22 నుంచి పునఃప్రారంభం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**హైదరాబాద్, జూన్ 06 (జనంసాక్షి) :** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న హైడ్రా ప్రజావాణి కార్యక్ర మాన్ని ఈ నెల 8వ తేదీతో పాటు 15వ తేదీన రద్దు చేసినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ ఫిర్యాదులు క్లియర్ చేసే క్రమంలో మే 11వ తేదీ నుంచి 4 సోమవారాలు ప్రజావాణికి విరామం ఇచ్చిన విషయం విదితమే. వాస్తవానికి ఈ నెల 8వ తేదీన ప్రజావాణి పునః ప్రారంభం కావాల్సి ఉన్నా.. ఇంకా ముఖ్యమైన ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉన్నందున గడువును మరో రెండు వారాలు పెంచినట్టు తెలిపారు. జూన్ 22వ తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

- మహిళ మృతి.. బాలుడికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్, జూన్6 (జనంసాక్షి) :** ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన అనంతరం అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు బుద్ధి

- సొంతింటిని వృద్ధులకు అప్పగించిన అధికారులు



**మిర్యాలగూడ, జూన్6 (జనంసాక్షి) :** వృద్ధ తల్లిదండ్రులను దూరం కొట్టిన కొడుకులకు కలెక్టర్ గట్టి బుద్ధి చెప్పారు. వారి ఇంటిని వారికి స్వాధీనం చేయించారు. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇంజం చంద్రకళ భర్త రమణారెడ్డి (70) వయోవృద్ధులు. వీరికి ఇద్దరు కుమా రులు, ఓ కుమార్తె ఉంది. వారి విద్యాభ్యాసం, పెళ్లిళ్ల వంటి బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇల్లు కలదు. వీరి పేరు మీద ఉన్నటువంటి ఇంటిలో కుమారుడు గత ఐదేండ్లుగా నివాసం ఉంటూ తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పక్షవాతం, మోకాళ్ల ఆపరేషన్, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధులు ఆర్డీఓ ట్రిబ్యునల్ అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్, సీనియర్ సిటిజెన్స్ చట్టాన్ని ఆశ్రయించడంతో వయోవృద్ధుల చట్టం 2007ను అనుసరించి జిల్లా కలెక్టర్ గత నెల 15వ తేదీన సదరు ఆస్తిని వారికి స్వాధీనపరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు పరచాల్సిందిగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జరపాలని గత 23వ తేదీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, స్థానిక సీఐ నాగభూషణం, తాసీల్దార్ సిబ్బంది, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయోవృద్ధులను శనివారం వారి ఇంటిలోకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, ఆర్ఐ, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు గారు నాగిరెడ్డి నవీన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మార్కెట్‌లో జంక్షన్ బాక్సుల ధ్వంసం

- విలువైె వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లిన దొంగలు



**భువనగిరి, జూన్6 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ మార్కెట్ ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన జంక్షన్ బాక్స్‌లను ధ్వంసం చేసి సుమారు రూ.25 లక్షల విలువ గల విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగంగా ఉన్న జంక్షన్ బాక్స్‌లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ముందుగా విద్యుత్ కనెక్షన్లను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది జంక్షన్ బాక్స్‌లు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయంతో పాటు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం సంభవించిందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు చోరీ కావడం స్థానికంగా సంచలనం రేపింది. మార్కెట్ వంటి కీలక ప్రభుత్వ ప్రాంగణంలో భద్రతా లోపాలు ఎలా చోటు చేసుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై మార్కెట్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో పాల్గొన్న వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రధాన కేంద్రాల్లో రాత్రి వేళల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం



**కరీంనగర్, జూన్6 (జనంసాక్షి) :** మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# విశ్వవేదికపై సింగరేణి జెండా

- మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రథమ బహుమతి
- అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు
- చైనా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల జట్లను వెనక్కినెట్టి ఘన విజయం
- రెస్క్యూ జట్టును అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన సింగరేణి రెస్క్యూ జట్టును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం అభినందించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సింగరేణి సీఎండీ జ్యతి బుద్ధ ప్రకాష్ తో కలిసి రెస్క్యూ జట్టు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు సాధించిన ప్రతిష్ఠాత్మక ట్రోఫీలను, మెడల్స్ ను డిప్యూటీ సీఎంగారికి అందించారు. ఈ సందర్భంగా రెస్క్యూ టీం సభ్యులను ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందించారు. భూగర్భ గనుల రక్షణలో తామెప్పుడూ అగ్రగామినే అని సింగరేణి సంస్థ ప్రపంచ వేదికపై మరోసారి నిరూపించిందన్నారు. జాంబియా దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి రెస్క్యూ జట్టు అద్భుత ప్రదర్శనతో విశ్వవిజేతగా నిలివడం సంతోషకరమని అన్నారు. చైనా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్, కొలంబియా వంటి గనులు అధికంగా ఉండే దిగ్గజ దేశాల జట్లతో పోటీపడి... భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి కైవసం చేసుకోవడం గర్వకారణమని అన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రెస్క్యూ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి అందించే సేవలు అసమానమైనవని కొనియాడారు. సింగరేణిని కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. గనుల్లో అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే మన రెస్క్యూ సిబ్బంది నైపుణ్యం, అంతర్జాతీయ పోటీల ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె. వెంకటేశ్వర్లు, జీఎం (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ జట్టు సభ్యులు మరియు సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు

**చండీఘడ్, జూన్6 (జనంసాక్షి) :** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘూరా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370